## పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు

وَمَا نُرْسِلُ الْمُرْسَلِيْنَ
اِلَّا مُبَشِّرِيْنَ وَمُنْذِرِيْنَ
فَمَنْ اٰمَنَ وَاَصْلَحَ فَلَا خَوْفٌ عَلَيْهِمْ
وَلَا هُمْ يَحْزَنُوْنَ (سورۃ الانعام:49)

**అనువాదం:** మేము ప్రవక్తలను కేవలం శుభవార్తను అందించుటకు, హెచ్చరికలు చేయువారిగా పంపుదుము. కనుక విశ్వసించి తమని దిద్దుకొనిన వారికి ఎట్టి భయముండదు. వారు దు:ఖించరు.

**(అన్‌ఆమ్: 49).**

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

www.akhbarbadrqadian.in

సంపుటి: **7**

సంచిక : **22**

వార్షిక చందా 575/-రూ॥

**02 జూన్ 2022 క్రీ. శ. 01 జుల్ ఖాయిదహ్ 1443 హి.ఖ. 02 ఏహ్‌సాన్ 1401 హి. శ.**


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِكْ لَنَا فِيْ عُمْرِهٖ وَاَمْرِهٖ

దేవుని సన్నిధిలో దైవభీతితో రోధించు వారిపై నరకం నిషేధించ బడుతుంది. దేవుని సన్నిధిలో స్వచ్ఛత, సన్మార్గములను అవలంభించు వారికి విలువ ఉంటుందనే విషయాన్ని మీరు ఎన్నడు మర్చిపోకండి.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశములు:-**

ఒకవేళ అల్లాహ్ తాలా యొక్క వైభవం మరియు ఒత్తిడి మరియు అతని భయం మనస్సులో ఉన్నచో అవి మనస్సులో ఒక దు:ఖాన్ని, అభ్యర్థన పుట్టుకొచ్చి దేవుని కోసం ఒక్క కన్నీటి చుక్క కన్నుల నుండి కారినా కూడ అట్టి వ్యక్తిపై ఖచ్చితముగా నరకం నిషేధించబడుతుంది. కావున మానవులు మేము చాలా ఎక్కువగా ఏడుస్తుంటాము కదా అని మోసపోకండి. కేవలం రోధించడం వలన కన్నులు నొప్పిపెట్టి, కంటి రోగాలకు కారణం అవ్వడం కంటే మరెలాంటి ప్రయోజనం చేకూరదు.

నేను మీకు ఉపదేశించునదేమనగా, దేవుని సన్నిధిలో దైవభీతితో రోధించు వారిపై నరకం నిషేధించ బడుతుంది. కాని ఎప్పటి వరకైతే దేవున్ని దేవుడిగా, అతని ప్రవక్తను ఒక ప్రవక్తగా మరియు అతని గ్రంథాన్ని సత్య గ్రంథముగా స్వీకరించినంత వరకు కేవలం స్వీకరించడమే గాకుండా విశ్వసించనంత వరకు ఆ ఆవేదన, ఆ దైవభీతితో కూడిన దు:ఖ భాగ్యము లభించదు. వైద్యుడు ఒక రోగికి ఔషదాన్ని ఇస్తాడు. ఫలితముగా అతనికి నెమ్మది నెమ్మదిగా విరోచనాలు అవుతాయి. ఎప్పటి వరకైతే బంకవిరోచనాలు రావో అప్పటి వరకు ఆ జబ్బును స్వస్థ పర్చడం కుదరదు. అలా వచ్చే బంక విరోచనాలే కడుపులో ఉన్నటు వంటి అజీర్ణ పదార్థాలను, మలినాలను బయటికి తీసుకవస్తాయి. లోలోన జబ్బును పెంచి పోషించే అన్ని రకాల విష పదార్థాలు, వాటి కారకాలు అన్నియు అట్టి విరోచనాలతోనే బయటికి వస్తాయి. అప్పుడే అట్టి రోగికి స్వస్థత చేకూర్చబడుతుంది. అదే విధముగా దైవ సన్నిధిలో మోకరిల్లి ఎక్కిల్లు పడునట్లుగా ఏడ్పు రోధనలో అన్ని రకాల మనో మలినాలు, మనో కల్మషాలు బయటికి వస్తాయి. అప్పుడు అతని మనస్సు పరిశుభ్రముగా, పవిత్రముగా తీర్చిదిద్ద బడుతుంది. పాశ్చాత్తాప దశలో వెలువడునట్టి దైవజనుల ఒక్క కన్నీటి చుక్క, కుల్లు కుతంత్రాలు, ప్రదర్శనకారి తనం మరియు అంధాకారంలలో మునిగి ఉన్న వ్యక్తి ఒక నదిని ప్రవహింపజేసిన దాని కంటే ఎంతో గొప్పది. ఎందుకనగా అతని ఒక్క కన్నీటి చుక్క దేవుని కోసం. కాని వీరిది వారి కోసం, వారి అవసరాల కోసం.

దేవుని సన్నిధిలో స్వచ్ఛత, సన్మార్గములను అవలంభించు వారికి విలువ ఉంటుందనే విషయాన్ని మీరు ఎన్నడు మర్చిపోకండి. మోహమాటాలకు, కల్పితాలకు అతని సన్నిధిలో ఎలాంటి చోటు లేదు.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 371, ప్రచురణ 2018 ఖాదియాన్)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(1950) అబూ సల్మా ఇలా ఉల్లేఖించారు: నేను హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ అన్‌హా చెప్పగా విన్నాను. వారు ఇలా చెప్పారు. రమజాన్ ఉపవాసాలు నాపై విధి గావించబడ్డాయి. కాని నేను వాటిని పూర్తి చేయలేక పోయేదానిని. షఅబాన్ మాసంలోనే పూర్తి చేసేదానిని. యహయా ఇలా అన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి పనుల వలన గాని లేదా స్వయముగా వారే రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పనులలో సహకరించుటలో ఇలా జరిగి ఉండవచ్చును.

(1954) హజ్రత్ ఉమర్ రజియల్లాహ్ అన్‌హు ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:. రాత్రివేళ అటుగా రావడం ప్రారంభించినచో, పగలు ఇటు నుండి వెళ్ళిపోవుచున్నచో సూర్యుడు పూర్తిగా అస్తమించినచో ఉపవాస దారులు ఇఫ్తార్ చేయవచ్చును.

బాలికల జననంను చెడుగా భావించేవారి ఈ పని చాలా నీచమైనది. ఒకవేళ బాలికలే లేనిచో వారు ఎలా జన్మించేవారు. ఒకవేళ బాలికలే లేకపోతే రాబోవు రోజులలో వారి కుమారుల వారసత్వం ఎలా కొనసాగుతుంది?......ఆది నుండి మహిళల హక్కులను కాపాడుతూ, వాటిని పర్యవేక్షిస్తూ వచ్చిన గ్రంథమేమిటో చెప్పండి చూద్దాం. అది కేవలం ఒక పవిత్ర ఖుర్‌ఆన్‌యే.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్‌హు అన్నహల్ ఆధ్యాయపు 60వ సూక్తి **యత వరాఅ మినల్ ఖౌమి సూఇ మా బుష్షిర బిహీ అయుమ్‌సికుహూ అలా హూనిన్ అం యదుస్సుహూ ఫిత్తురాబి అలా సాఅ మా యహ్‌కుమూన్** ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు:

అనగా తండ్రి వాత్సల్యం ఉన్నప్పటికి కూడ అవమానంను భరిస్తూ ఆ కుమార్తెను ప్రాణాలతో ఉంచాలా? లేక ఆ కుమార్తెను సజీవ సమాధి చేయాలా? అనే ఆలోచనలో అతడు పడిపోవును.

ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా బాలికలను సజీవ సమాధి చేయు అచారం అరబ్ మొత్తంలో ఉన్నదని ప్రజలు భావిస్తుంటారు. కాని ఇది నిజం కాదు. ఒకవేళ అలా కొనసాగినచో వారి దేశంలో బాలికల సంఖ్య చాలా తక్కువగా ఉండాలి. వాస్తవమేమనగా బాలిక జన్మించిన విషయాన్ని అరబ్ దేశస్తులందరు చెడుగానే భావించేవారు. కాని వారిని సజీవ సమాధి చేయు ఆచారం మాత్రం కేవలం కొన్ని గొప్ప గొప్ప మరియు గర్విత తెగలలోనే ఉండేది. బాలిక జన్మించి నప్పుడు బాధపడడం వేరు. ఆ బాలికను సజీవ సమాధి చేయడం వేరు. నేటికి కూడ బాలికల జననంను ఇల్లా మాషా అల్లాహ్ ప్రజలుచెడుగానే భావిస్తుంటారు. కాని కొందరు మాత్రమే వారిని హత్య చేస్తారు. అరబ్‌లోని మక్కాలో ఇలాంటి దురాచారము ఉండేది కాదు. తమకు తాము గొప్పవారమని భావించే కొన్ని తెగలలోనే ఇలాంటి ఆచారం ఉండేది. అది కూడ కొంత మంది ప్రముఖుల కుటుంబాలలో మాత్రమే. కావున ఇక్కడ ఒక సాధారణ ఆచారంను గూర్చి ప్రస్తావించబడలేదు. కేవలం ఆయా తెగలకు చెందిన కొందరు నేతల పనులను గూర్చి ప్రస్తావించడం జరిగింది. వారి పనులను ఆ తెగల వారందరు అనుసరించ కున్న కూడ అట్టి పనిని మాత్రం గౌరవ ప్రదమైన పనిగా భావించేవారు.

అలా సాఅ మా యహ్‌కుమూన్‌లో తెల్పబడిన విషయమేమనగా బాలికల జననంను చెడుగా భావించేవారి ఈ పని చాలా నీచమైనది. ఒకవేళ బాలికలే లేనిచో వారు ఎలా జన్మించేవారు. ఒకవేళ బాలికలే లేకపోతే రాబోవు రోజులలో వారి కుమారుల వారసత్వం ఎలా కొనసాగుతుంది?.

పవిత్ర ఖుర్‌ఆన్ ఆది నుండి మహిళల గౌరవాన్ని కాపాడుతూ వచ్చింది. వారి హక్కులను గౌరవించింది. అయినా కూడ నేటికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మహిళలపై దౌర్జన్యం చేశారనే చెప్పుకుంటూ వస్తారు. ఆది నుండి మహిళల హక్కులను కాపాడుతూ, వాటిని పర్యవేక్షిస్తూ వచ్చిన గ్రంథమేమిటో చెప్పండి చూద్దాం. అది కేవలం ఒక పవిత్ర ఖుర్‌ఆన్‌యే.

(తఫ్సీరే కబీర్ సంపుటి 4, పుట 185, ప్రచురణ 2010, ఖాదియాన్).


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

వైభవోపేతుడైన అల్లాహ్ తన ప్రాణుల ప్రయోజనాల కోసం తేరిచినట్టి ద్వారములలో ఇది ఒకటి. అనగా దుఆ. ఎప్పుడైన ఎప్పుడైన ఎవరైన మిన్నంటిన రోధనలతో ఆ ద్వారములోకి ప్రవేశించినచో కనికరం గల ఆ మిత్రుడు (అల్లాహ్) అట్టి వ్యక్తికి పవిత్రమైన, పరిశుద్ధమైన దుప్పటిని కప్పును (తన సంరక్షణలోకి తీసుకొనును).

శుభప్రదమైన రమజాన్ మాసంలో దుఆల ప్రాధాన్యత మరియు దుఆల ఆమోధితం కోసం కావల్సిన సాధనాలు, షరతులను గూర్చి వివరణాత్మక ప్రసంగం.

మనలో ఈ రమజాన్ మాసంను శాశ్వతముగా దుఆల ఆమోదిత మాసంగా మార్చుకోను వారు అదృష్టవంతులు.
అల్లాహ్ తాలా యొక్క నిజమైన దాసులుగా మారుదుముగాకా!. అల్లాహ్ తాలా ఆదేశాలకు అనుగుణముగా నడుచుకొందుము గాకా!. మన విశ్వాసాలను పటిష్టం చేసుకొందుము గాకా!.

పవిత్ర ఖుర్ఆన్ సూక్తి వల్లజీనా జాహదూ ఫీనా ల నహ్దియన్నహుం సుబులనా సూక్తికి మరియు దుఆల ఆమోధిత ఆంశంకు గల అనుబంధం.

ప్రపంచ పరిస్థితుల కోసం ప్రత్యేక దుఆ కోసం ప్రోత్సాహం " అల్లాహ్ తాలా ప్రపంచాన్ని వినాశనకారుల నుండి కాపాడుగాకా!. వారికి తెలివి తేటలను కూడ ప్రసాదించును గాకా! వారు తమ సృష్టికర్తను గుర్తించుదురు గాకా!."

బద్రీ అనుచరులను గూర్చి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ప్రసంగించినటు వంటి జుమా ప్రసంగాలను ఆధారం చేసుకొని ఎం.టి.ఏ వారు తయారు చేసినటు వంటి www.313companions.org వెబ్‌సైట్ ప్రారంభోత్సవం.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 08 ఏప్రిల్ 2022, (08 షహాదత్ 1400 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔
وَإِذَا سَأَلَكَ عِبَادِيْ عَنِّيْ فَإِنِّيْ قَرِيْبٌ أُجِيْبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ فَلْيَسْتَجِيْبُوْا لِيْ
وَلْيُؤْمِنُوْا بِيْ لَعَلَّهُمْ يَرْشُدُوْنَ

ఈ సూక్తి అనువాదం ఈ విధముగా గలదు: నన్ను గూర్చి నా దాసులు నిన్ను ప్రశ్నించునప్పుడు నిశ్చయముగా నేను సమీపముననే ఉందును. నన్ను పిలుచుచు ప్రార్థించు వాని ప్రార్థనకు నేను సమాధానమిత్తును. కనుక వారు సన్మార్గము నవలంభించుటకు సావధానులై నా దేశమును వినవలయును. నా యందు విశ్వాసముంచ వలయును. (బఖ్రహ్: 187)

అల్లాహ్ తాలా అనుగ్రహం వలన మనం రమజాన్ మాసంలో నుండి ప్రయాణిస్తున్నాము. ఈ మాసం దుఆలు ఆమోదించబడు మాసం. అల్లాహ్ తాలా ఈ మాసంలో ప్రత్యేక కరుణతో దుఆలను ఆమోదిస్తాను అని ప్రకటించాడు. అదే విధముగా తన ప్రత్యేకమైన అనుగ్రహపు చెలిమను పరువళ్ళతో ప్రవహింప జేయుదునని తెలిపాడు. ఎందుకనగా ఈ మాసంలో మానవుడు తన ప్రతి పనిని దేవుని ప్రీతిని పొందడం కోసం చేస్తాడు. చివరికి అన్నపానియాలను కూడ అల్లాహ్ తాలా ఆదేశం మేరకు ఒక నిర్ణయిత సమయం వరకు సేకరించకుండ ఉంటాడు. అందుకోసమే " ఈ మాసంలో స్వర్గపు ద్వారములు తెరుచుకుంటాయని, నరకపు ద్వారములు మూసుకుంటాయని, ఈ మాసంలో షైతాన్ బంధించబడుతుందని అల్లాహ్ తాలా తెలిపినట్లుగా " ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు.

(సహి ముస్లిం, కితాబుస్సియామ్, బాబ్ ఫజల్ షహరు రమజాన్, హదీస్ 2495).

కావున అల్లాహ్ తాలా అనుగ్రహాన్ని పొందుటకు కావలసిన సామాగ్రిని , స్వయముగా అల్లాహ్ తాలాయే ఈ మాసంలో ఏర్పాటు చేస్తున్నందున దీనిని మనం మన అదృష్టముగా భావించవలెయును. అల్లాహ్ తాలా తన వైపు నుండి ఇలాంటి అవకాశాన్ని కల్పించిన కూడ దానిని సద్వినియోగ పర్చుకుంటూ మనం అతని అనుగ్రహాన్ని పొందకుండా ఉన్నచో అది మన దురదృష్టము అనబడుతుంది. ఈ రమజాన్ మాసంలో ప్రపంచంలో ఉన్నటు వంటి వ్యభిచారులు, దొంగలు, దుష్టులు, దుర్మార్గులు తమ దుశ్చర్యలను మానుకుంటారా?. మానుకోరు. ఖచ్చితముగా దుశ్చర్యలకు పాల్పడుతూనే ఉంటారు. ఒకవేళ అందరి షైతాన్ బంధించబడినచో మరి ఈ దుశ్యర్యలకు వారు ఎందుకు పాల్పడుచున్నారు?. (ఎందుకనగా) ఈ హితోపదేశం విశ్వాసులకే వర్తిస్తుంది. ఆపై అల్లాహ్ తాలా అనుగ్రహాన్ని పొందుటకు ప్రయత్నించువారికే వర్తిస్తుంది. మీరు నాకోసం మీ ధర్మబద్ధమైన వాటిని కూడ త్యజించుటకు సిద్ధముగా ఉన్నారు, కావున నేను మీకు శుభవార్తను అందిస్తున్నాను అని అల్లాహ్ తాలా రమజాన్ మాసంలో తెల్పుచున్నాడు. ఆ శుభవార్త ఏమిటనగా, సాధారణ రోజులలో స్వతంత్రముగా ఉన్నటు వంటి షైతాన్‌ను నేడు నేను నా ఆదేశాలను పాటించువారి కోసం బంధించాను. ఈ రమజాన్ మాసంలో బంధించాను. వాస్తవానికి ఆ షైతాన్ మానవుని కుడి, ఎడమల నుండి, ముందు వెనకల నుండి దాడి చేయుటకు మరియు వారిని ప్రలోభాలకు గురిచేసి తన వెనకాల నడిపించుకొనుటకు అల్లాహ్ తాలాతో వ్యవధిని కోరుకున్నది. కావున నా కొరకు ఉపవాసంను పాటించువారిని, తమ అన్నపానియాలను తగ్గించుకోను వారిని, తమ ఆధ్యాత్మికతను పెంపొందించుకొనుటకు ప్రయత్నించు కొను వారిని పూర్తి స్థాయిలో అభయ పూరితమైన నా సంరక్షణలోకి తీసుకుంటున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కూడ ఈ విధముగా తెలిపారు. బాహ్యా అహారాన్ని తగ్గించుకొని ఆధ్యాత్మికపరమైన అహారాన్ని పెంచుకొంటున్నారు. లేదా పెంచుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. ఇదే రమజాన్ మాసపు ఉద్దేశము, ఇదే ఉపవాసాల లక్ష్యం.

(మల్ఫూజాత్ సంపుటి 9, పుట 123)

అల్లాహ్ తాలా ఇలాంటి వారి షైతాన్‌ను పూర్తి స్థాయిలో బంధిస్తాడు. అంతేగాకా "ఉపవాసాలను పాటించువారికి నేను ప్రతిఫలమును అవుతానని" అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు. (సహీ బుఖారి, కితాబుత్తౌహీద్, బాబ్ ఖౌలల్లాహు తాలా యురీదూన అన్ యుబద్దలూ కలామల్లాహి, హదీస్ 7492) ఇది ఎంతటి శు భవార్త. కావున మనం దీని నుండి ప్రయోజనం పొందుటకు ప్రయత్నించాలి. అదే విధముగా అల్లాహ్ తాలా మన కోసం తెరిచినటువంటి స్వర్గపు ద్వారములలోని అన్ని ద్వారముల గుండా ప్రవేశించుటకు ప్రయత్నించవలెను. అంతేగాని మీరు ఆకలి దప్పికలతో ఉండడం వలన నాకు ఎలాంటి లాభం చేకూరదు అని అల్లాహ్ చేసిన హెచ్చరిక పరిధిలోకి రాకుండా మనలను మనం చూసుకోవాలి. ఒకవేళ మీరు ఉదయం వేళ సహరి భుజించి, సాయంత్రం వేళ ఇఫ్తారి భుజించి, పగలు మరియు రాత్రివేళలో మీరు చేయవలసిన సత్కార్యములను మీరు చేయకుండా ఇలా ఆకలి దప్పికలతో ఉండడం, రోజంతయు ఏమి తినకుండా త్రగకుండా ఉండడం వంటివి మీకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చవు. అల్లాహ్ తాలాకు ఇలాంటి మీ ఆకలి దప్పికల అవసరం ఏమాత్రం లేదు. ఈ సందేశం మనకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా లభించినది.

(సహీ బుఖారి, కితాబుస్సౌమ్, బాబ్ మన్‌లం యదఊ ఖౌల జ్జూరు వల్ అమలుబిహి ఫి స్సౌమి, హదీస్ 1903)

కావున మనం ఈ వాస్తవికతను అర్థం చేసుకుంటూ, అందుకు అనుగుణముగా రమజాన్ యొక్క ఉద్దేశంతో మనం మన జీవితాన్ని జీవించాలి.

నేను పారాయణం చేసినటువంటి ఈ సూక్తి రమజాన్ మాసపు ప్రాధాన్యతను, ఆదేశాలను మరియు ఉపవాసాల ప్రాముఖ్యతలను గూర్చి తెల్పునట్టి సూక్తిలలోని మధ్య సూక్తి. ఈ సూక్తిలో అల్లాహ్ తాలా దుఆలను స్వీకరించు విధానాలను, ఏ ఏ వ్యక్తుల దుఆలు ఆమోదించబడుతాయో వారిని గూర్చి వివరముగా తెలిపాడు.(అనగా) ఆరాధనలనే జీవితంగా భావించువారిని గూర్చి, దైవారాధకులుగా పరివర్తనం చెందువారిని, షైతాన్ చిక్కులలో నుండి బయటపడాలనుకునేవారిని, తమ దుఆల ఆమోదయోగ్యత దృశ్యాలను చూడాలనుకునే వారిని గూర్చి తెల్పుచున్నాడు. "ఓ ప్రవక్తా! మా దేవుడు ఎక్కడున్నాడు? అని నా దాసులు నిన్ను ప్రశ్నించినచో, నిన్ను అడిగినచో " అనే పదాలతోనే అల్లాహ్ తాలా ఈ సూక్తిని ప్రారంభించి, ఒక వీరాభిమాని వలే వ్యాకులత చెందుతూ అడిగినచో, అల్లాహ్ తాలాను పొందడానికి అన్నిరకాలుగా ప్రయత్నిస్తున్న చింతనతో అడిగినచో వారితో ఇట్లనుము, భయపడకుము. నేను మీ సమీపంలోనే ఉన్నాను అని అల్లాహ్ తాలా సమాధానం ఇస్తున్నాడు. కావున అల్లాహ్‌ను పొందడం కోసం అల్లాహ్ దాసుడు కావడంనే అల్లాహ్ తాలా మొదటి షరతుగా లేదా నిబంధనగా విధించాడు.

కావున మానవుడు దేవుని దాసుడు కావడం కోసమైన హక్కులను నెరవేర్చినచో అప్పుడే నేను అతని దుఆలను ఆమోదిస్తాను, అతని షైతాన్‌ను బంధిస్తాను, షైతాన్ దాడిచేయుటకు వచ్చినచో అతనికి సహకరించుటకు నేను వస్తాను అని అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు. కేవలం సంవత్సరంలోని ఒక మాసమైన ఈ రమజాన్ మాసంలోనే కాకుండా ఇలాంటి వ్యక్తిని శాశ్వతముగా షైతాన్ దాడుల నుండి కాపాడుతాను. అందుకు నిబంధన అతడు నా దాసత్వపు హక్కులను నెరవేర్చ వలెను. నా ఆదేశాలను నిరంతరం పాటించవలెను. కేవలం రమజాన్ మాసంలోనే సత్కార్యములు చేయకుండా నిరంతరం దేవుని మరియు అతని దాసుల హక్కులను చెల్లించవలెయును. పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు అనుగుణముగా ఆచరించవలెను. తమ విశ్వాసాన్ని పటిష్టపర్చుకోవలెను. అంతేగాకా నా సుగుణాలన్నింటి పట్ల సంపూర్ణ మైన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్గియుండాలి. ఆ తరువాత దుఆలు ఏ విధముగా ఆమోదించబడుతాయో ఆయా దృశ్యాలను చూడుము. తమ జీవితాలను ఈ విధముగా మల్చుకున్నవారే నిజమైన సన్మార్గమును, మార్గదర్శకమును పొందుతారు అని అల్లాహ్ తాలా అంటున్నాడు. కావున మనలో ఎవరైతే ఈ రమజాన్ మాసంను తమ దుఆల శాశ్విత ఆమోదిత మాసంగా మార్చుకొందురో వారు నిజమైన అదృష్టవంతులు.

అల్లాహ్ తాలా యొక్క నిజమైన దాసులుగా మారాలి. అల్లాహ్ తాలా ఆదేశాలకు అనుగుణముగా నడుచుకోవాలి. తమ విశ్వాసాన్ని పరిపూర్ణం చేసుకోవాలి. నేటి కాలపు ఇమాంను మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సత్య ప్రియులైన మసీహ్‌మౌవూద్ మరియు మహ్దియే మౌవూద్‌ను విశ్వసించు భాగ్యమును అల్లాహ్ తాలా మనకు కల్పించినందుకు మనం చాలా అదృష్టవంతులం. అల్లాహ్ తాలా అనుగ్రహాన్ని పొందు మార్గాలను, దుఆలు ఆమోదింపబడు మార్గాలు మరియు దుఆలను యాచించు విధానాలను వారే మనకు చూపించారు. ఒకానొక సందర్భములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు: "వైభవోపేతుడైన అల్లాహ్ తన ప్రాణకోటి శ్రేయస్సుకోసం దుఆ అనబడే ఒకే ఒక ద్వారమును తెరిచాడు. ఎప్పుడైన ఎవరైన మిన్నంటిన రోధనలతో ఆ ద్వారములోకి ప్రవేశించినచో కనికరం గల ఆ మిత్రుడు (అల్లాహ్) అట్టి వ్యక్తికి పవిత్రమైన, పరిశు ద్ధమైన దుప్పటిని కప్పును (తన సంరక్షణలోకి తీసుకొనును). ఆపై తన వైభవ ఆధికృతను ఎంతగా చూపుననగా అనవసర పనులు మరియు నిష్ప్రయోజ చేష్టల నుండి అతడు మైళ్ళ దూరం పారిపోవును (పూర్తి స్థాయిలో పవిత్రుడగును).

(మల్ఫూజాత్ సంపుటి 5, పుట438, ఎడిషన్ 1984)

దుఆలు ఆమోదింపజేసుకోవడం కోసం ఎలాంటి స్థితిని కల్పించుకోవలసి ఉంటుంది?. దుఆల ఆమోదం కోసం ఎలాంటి రుగ్మతలు అవసరం?. అల్లాహ్ తాలా దాసుడిగా మారుటకు ఏమి కావలెయును? అనే అంశాలను వివరిస్తూ హుజూర్ (అ) ఇలా తెలిపారు. "ఆచరణలను ఆచరించకుండా కేవలం దుఆలు చేయు వ్యక్తి ఒక విధముగా దేవున్ని పరీక్షించుచున్నాడు అనేది సత్యం.

అందుకే దుఆలు చేయడానికి ముందు తమ శక్తిసామర్థ్యాలన్నింటిని తప్పకుండా వెచ్చించాలి. " ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ అనే "దుఆ యొక్క అర్థం కూడ ఇదే. " మరల ఇలా తెలిపారు: " ముందుగా మానవుడు తన ఆలోచనలకు అనుగుణముగా ఆచరించుటకు తప్పకుండా ప్రయత్నించవలెను." తానుగా ఆలోచించాలి, అందుకు అనుగుణముగా ఆచరించాలి. " ఎందుకనగా పరికరాల అనుకరణలోనే సంస్కరణను మమేకం చేయడం అల్లాహ్ సాంప్రదాయం. అతడు ఏదో ఒక మాధ్యమం ద్వారా సంస్కరణను చేపట్టుతాడు. కావున దుఆ చేస్తున్నప్పుడు ఇతర మాధ్యమాల అవసరం ఏమున్నదని వాదించు వారు ఇక్కడ క్షుణ్ణముగా ఆలోచించి చూడాలి." దుఆ చేశాము కావున ఎలాంటి ప్రయత్నాలు చేయవలసిన అవసరం లేదు, మాధ్యమాల అవసరం ఏమాత్రం లేదు, ఆచరణల అవసరం లేదు అనేవారు . వారిని గూర్చి హుజూర్ (అ) ఇలా అంటున్నారు. " వారివి మూర్ఖపు ఆలోచనలు. స్వయముగా దుఆ కూడ ఒక రహస్య మాధ్యమం. అది ఇతర మాధ్యమాలను బహిర్గతం చేస్తుంది. " (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 124, ఎడిషన్ 1984) దుఆ కూడ ఒక మాధ్యమే. రహస్య మాధ్యము. ఇతర మాధ్యమాలు, ఇతర మార్గాలు తెరుచుకోవడానికి అది దోహదపడుతుంది.

దుఆలను ఆమోదింపజేసుకోవడం కోసం దేవుని దాసులు కావడం తప్పనిసరి. మానవుడు ముందుగా ప్రయత్నిస్తూ దేవుని నుండి అనుగ్రహాన్ని యాచించాలి. అమితముగా రోధిస్తూ అతని దాసులలో చేరిపోవడం మరియు అందుకు అనుగుణముగా ప్రయత్నించడమే దైవానుగ్రహమవుతుంది. నీ దాసులలో అనగా సిద్ధాంత పరంగా, విశ్వాస పరంగా అల్లాహ్ యొక్క ప్రత్యేక దాసులలో నన్ను చేర్చుకొనుము అని దుఆలు చేస్తుండాలి. అతడు దుఆలు చేయడానికి ముందు తన నడవడికను దైవప్రీతికి అనుగుణముగా మార్చుకొనుటకు మరియు అచంచల, పటిష్టమైన, ఖచ్చితమైన విశ్వాసాన్ని కల్గియున్న దాసులలో పరిగణింప జేసుకోనుటకు ప్రయత్నించాలి. మట్టి కణాలను కూడ బంగారంగా మార్చే శక్తి అల్లాహ్ తాలాకు ఉన్నదనే నమ్మకాన్ని కూడ ఆ దాసులు కల్గియుంటారు. ఎందుకు పనికి రానివాడిని కూడ తన దాసుడిగా మార్చుకునే శక్తిని కల్గియున్నాడని, వారికి తన మార్గాలను చూపిస్తాడని, ఫలితముగా వారు దేవున్ని చేరుకొనుటకు ఆయా మార్గాలను అనుసరిస్తారనే నమ్మకాన్ని కూడ వారు కల్గియుంటారు. ఈ అంశాన్ని గూర్చియే అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో "నా మార్గంలో నడుచుటకు ప్రయత్నించు వారి కొరకు నేను నా మార్గాలను చూపిస్తాను" తెల్పుచున్నాడు. అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. వల్లజీన జాహదూ ఫీనా లనహదియన్నహుం సుబులనా (అన్‌కబూత్:70) అనగా నన్ను కలుసుకోవాలని ప్రయత్నించువారికి మేము తప్పకుండా మా మార్గాలను చూపిస్తాము. కావున ఈ రమజాన్ మాసం ప్రత్యేకించి ఇందుకు ప్రయత్నించు మాసం. ఇందులో మనం మన శక్తిసామర్థ్యములకు అనుగుణముగా పూర్తి స్థాయిలో ప్రయత్నించాలి. దేవుని ఆరాధకులలో చేరినటువంటి దైవదాసులలో పరిగణింపబడుటకు, దేవుని అనుగ్రహాన్ని పొందిన వారిలో చేరుటకు, ఎవరి దుఆలను అల్లాహ్ తాలా ఆమోదిస్తాడో వారిలో చేరిపోవుటకు, అల్లాహ్ తాలా ఆదేశాలకు అనుగుణముగా నడుచుకొను వారిలో చేరుటకు, అల్లాహ్ తాలా సుగుణాలపై పూర్తి విశ్వాసం, నమ్మకం ఉన్నటువంటి వారిలో చేరుటకు, నిజమైన మార్గదర్శకం పొందినవారిలో చేరుటకు, ఎవరి షైతాన్‌లు శాశ్వితముగా బంధించబడుతాయో వారిలో చేరిపోవుటకు మనం ప్రయత్నించాలి. కాని అందుకు అల్లాహ్ తాలా తెల్పినట్లుగా ముందుగా తప్పకుండా మన మనోవాంచలను చంపుకొనుటకు ప్రయత్నించాలి. తమ నడవడికలను, స్థితిగతులను అల్లాహ్ తాలా అనుగ్రహాన్ని పొందుటకు అనుగుణముగా తప్పకుండా మల్చుకోవాలి. ఈ అంశంను గూర్చియే

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక సందర్భాలలో మనకు అనేక విధాలుగా మార్గదర్శకం చేశారు. ఈ క్రమంలోనే వారు ఒక చోట ఈ విధముగా తెలిపారు. "ఎంతో నిర్లక్ష్యంను, అశ్రద్ధను చూపునట్టి ఒక వ్యక్తి, ఎంతో విజ్ఞతతో, ఎంతో స్వచ్ఛతతో పూర్తి శక్తి సామర్థ్యంలతో అన్వేషించు ఒక వ్యక్తి వలే దేవుని అనుగ్రహం నుండి ప్రయోజనం పొందడం అనేది ఎన్నడు సాధ్యం కాదు. ఇదే విషయాన్ని మరొక చోట అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. అనగా వల్లజీన జాహదూ ఫీనా ల నహదియన్నహుం సుబులనా అనగా ఎవరైతే మా మార్గంలో ప్రయత్నిస్తారో మేము వారికి తప్పకుండా మా మార్గాన్ని చూపిస్తాము. "

(బరాహీనే అహ్మదియ్య భాగం 4, రూహాని ఖజాయిన్ సంపుటి 1, పుట 566-567, అనుబంధం సంఖ్య 11)

కావున పొందడం కోసం తమ శక్తి సామర్థ్యాలన్నింటిని ధారపోసి, తమ మనో వాంచలను అంతమొందించుకొని దేవుని అనుగ్రహం కోసం ప్రయత్నించేవారిలో దేవుడు ఎన్నడు కూడ నిర్లక్ష్యం, అశ్రద్ధ చూపించువారినే కలుపలేడని ఎంతో స్పష్టముగా ఇక్కడ తెలుపడమైనది.

మేము చాలా దుఆలు చేశాము, కాని మేము మా లక్ష్యాన్ని పొందలేక పోయాము అని చాలా మంది నాకు లేఖలు వ్రాస్తుంటారు. ఈ అంశంను గూర్చి ప్రశ్నిస్తుంటారు. ఇలా తప్పుగా చెప్పుకుంటారు. అల్లాహ్ తాలా తప్పుచేయడు. మానవుడు వేటినైతే చాలా దుఆలుగా భావిస్తున్నాడో బహుశా అల్లాహ్ తాలా దృష్టిలో అవి ఆ ప్రమాణా స్థాయికి చేరకపోవచ్చును. వారు ఇంకా శ్రద్ధతో ప్రయత్నించ వలసి ఉంటుంది. అంతేగాకా వారు దుఆ చేసే విధానంను కూడ సరిగా ఉందా? లేదా? చూసుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పుచున్నారు. ఏ వ్యక్తి అయితే తన విజ్ఞతతోని, శక్తి సామర్థ్యములతో, స్వచ్ఛతతో అతనికోసం అన్వేషిస్తారో మేము తప్పకుండా వారికి మా మార్గమును చూపిస్తాము అని అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు. కావున మనం మన విజ్ఞతను అనుసరించి, తమ శక్తి సామర్థ్యములను అనుసరించి అల్లాహ్ తాలా ఆదేశాను సారం అనగా ఫల్ యన్తజీబూలీ నా పిలుపుకు నమాధానమివ్వవలెనుకు అనుగుణముగా నడుచుకుంటున్నామా? లేదా?. అల్లాహ్ తాలా ఆదేశాలను పూర్తి స్థాయిలో ఆచరించుటకు ప్రయత్నిస్తున్నామా? లేదా? చూసుకోవాలి. ఒకవేళ పూర్తి స్థాయిలో అనుసరించనిచో అల్లాహ్ తాలా మా దుఆలను ఆలకించలేదు అని ఎలాంటి ఫిర్యాదు చేయకూడదు. దుఆలను ఆమోదింపజేసుకోవడం కోసం ముందుగా తమ స్థితిగతులను మార్చుకొని అల్లాహ్‌వైపు తప్పకుండా అడుగులు వేయాలి. తప్పకుండా ప్రయత్నం చేయాలి.

దాసుడు జిహాద్‌ను అంతిమ స్థాయి వరకు ఏ విధముగా తీసుకెళ్ళగలడు. అల్లాహ్ తాలా తన దాసునిపై ఎంతటి కరుణను కురిపించుననగా, దాసుడు కొద్ది పాటి ప్రయత్నంచేసిన కూడ దానినే జిహాద్‌గా భావించి అమితంగా అనుగ్రహి స్తుంటాడు. అతని దాతృత్వం అన్నింటిపై ఆధిక్యతను కల్గియున్నది. కావున దాసుడి జిహాద్‌కూడ సులువు చేయబడుతుంది. దానిని కూడ సౌకర్యవంతముగానే చేస్తాడు. ఈ క్రమంలోనే " దాసుడు నా వైపు ఒక్క అడుగువేసి ముందుకు వచ్చినచో నేను అతనివైపు రెండు అడుగులు అతని వైపు వేస్తాను. అతడు నావైపు నడిచి వచ్చినచో , వడివడిగా వచ్చినచో నేను అతని వైపు పరుగెత్తుకుంటూ వస్తాను అని అల్లాహ్ తెల్పినాడు" అని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారు.

(సహి ముస్లిం కితాబు జ్జికర్ వ ద్దుఆ...... బాబ్ ఫజలుజ్జికర్ వ ద్దుఆ వ తుఖ్రిబ్ ఇల ల్లాహి తాలా , హదీస్ 6833)

మొత్తానికి అల్లాహ్ తాలా మనపై ఎంతగానో కరుణిస్తాడు. కాని అందుకు స్వచ్ఛత, విధయతయే నిబంధన. అంతేగాని రమజాన్ మాసంలో మేము నమాజ్‌లను సల్పుతాము, అల్లాహ్ తాలా ఆదేశాలకు అనుగుణముగా నడుచుకుంటాము, దేవుని హక్కులను, అతని దాసుల హక్కులను చెల్లిస్తాము, రమజాన్ మాసంలో అవన్నియు చేస్తాము అని వాగ్దానం చేసి రమజాన్ తరువాత దేవున్ని మరియు అతని ఆదేశాలను మర్చిపోవడం అంటూ చేయకూడదు.

ప్రాపంచికత మనపై ఆధిక్యమైన తరువాత నన్ను పిలిచేవారి పిలుపును నేను వింటాను అని అల్లాహ్ తాలా తెల్పినాడుడు. కావున నేను రమజాన్ మాసంలో చాలా దుఆలు చేశాను. కాని నా దుఆలు స్వీకరించబడలేదు అని మనం అల్లాహ్ తాలాపై ఎలాంటి ఆరోపణలు చేయకూడదు.

ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా అల్లాహ్ తాలా ముందు ఏదియు గోప్యముగా ఉండదు. మానవుడు తన వాగ్దానాలను, వినతులను పూర్తి చేస్తానని గతంలో కూడ వాగ్దానాలు చేసి అట్టి వాగ్దానాలను భంగపర్చినాడనే విషయం ఇప్పుడు కూడ కేవలం రమజాన్ కోసమే ఇలాంటి వాగ్దానాలు చేస్తున్నాడు అని కూడ అల్లాహ్ తాలాకు తెలుసు. కావున ఇలాంటి వారితో అల్లాహ్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తాడు. కాని అప్పుడప్పుడు ఇలాంటి వారి దుఆలను కూడ అల్లాహ్ తాలా స్వీకరిస్తుంటాడు. తద్వారా వారికి కూడ అల్లాహ్ తాలా దుఆలను స్వీకరిస్తాడు అనే విషయాన్ని తెలపాలని, వారిని ఎల్లవేళల అల్లాహ్ వైపు మ్రొగ్గుచూపేలా చేయాలని భావిస్తాడు. మొత్తానికి అల్లాహ్ తాలా తన దాసులపై దౌర్జన్యం చేయడు. అతడు తన దాసులను ఎల్లప్పుడు తన కరుణాప్రదమైన ఒడిలోకి చేర్చుకోవాలనే ప్రయత్నిస్తుంటాడు. ఒక తల్లికి తన తప్పిపోయిన బిడ్డ దొరికినచో ఎంత సంతోషం లభిస్తుందో లేదా ఎడారిలో తన ఆహార సామాగ్రిని కల్గియున్న ఒకబాటసారి ఒంటె తప్పిపోయి, మరల దొరికినప్పుడు అతనికి ఎంతగా పట్టరాని సంతోషం కల్గుతుందో, తన దాసుడు కూడ తనవైపు రావడం, స్వచ్ఛతతో తన ఆదేశాలను పాటించడం వలన అల్లాహ్‌కు అంతకు ఎన్నోరెట్లు అధికముగా సంతోషం కల్గుతుంది. అల్లాహ్ తాలా ఈ విధముగా సంతోషిస్తాడు అని తెల్పుటకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మన ముందు ఇలాంటి ఉదాహరణలను వర్ణించారు.

(సహి బుఖారి, కితాబుల్ అదబ్, బాబ్ రహ్మతుల్ వలద్...... హదీస్ 5999, కితాబుద్దావత్, బాబుతౌబతు, హదీస్ 6309)

కావున మనమే దేవుని హక్కులను చెల్లించు విషయంలో నిర్లక్ష్యముగా వ్యవహరిస్తుంటాము. ఆపై అల్లాహ్ తాలా మా దుఆలను ఆలకించలేదని ఆరోపణలు కూడ చేస్తుంటాము. కావున మనకు మనమే పరీక్షించుకోవాలి. ఆపై మేము అల్లాహ్‌ను పొందుటకు ఈ రమజాన్ మాసంను ఆధారముగా చేసుకుంటాము, అతని ఆదేశాలకు అనుగుణముగా నడుచుకోవడానికి పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తాము అని వాగ్దానం చేసుకోవాలి.

మనపై ఎలాంటి పరిస్థితులు వచ్చినా, ఎంత కాలం మనకు జిహాద్ చేయవలసి వచ్చినా అల్లాహ్ తాలా ప్రేమను, సాన్నిహిత్యాన్ని పొందుటకు మనం ఈ జిహాద్‌ను చేస్తూనే ఉండాలి. మన విశ్వాసాలను పటిష్టముగా చేసుకొనుటకు ప్రయత్నిస్తుండాలి. ఒకవేళ మనం మనపై ఇలాంటి స్థితిని ఏర్పర్చుకున్నచో దుఆల ఆమోదిత మహాద్భుతాలను కూడ మనం చూడగల్గుతాము. ఇవి కేవలం మాటలే కావు. ఈ స్థాయిని ప్రజలు చేరుకునేవారు. నేడు కూడ చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: " ఈ సూక్తి అవతరించి 13 వందల సంవత్సరాలు గడిచాయి. ఈ అంశంలో పేర్కొన్నట్లుగా ఈ సూక్తిని అనుసరించి తగిన సమయానుకూలంగా ప్రయత్నించినవారు ల నహ్‌దియ్యన్నహుం అనే వాగ్దానం నుండి ఒక ప్రత్యేకమైన భాగాన్ని పొందుతూ వచ్చారు. నేడు కూడ పొందుతున్నారు. ఇక ముందుకూడ పొందెదరు. "

(అల్ హఖ్ ముబాహిసా దిల్లి, రూహాని ఖజాయిన్ సంపుటి 4, పుట 192)

కావున అల్లాహ్ తాలా యొక్క ఈ అనుగ్రహం నుండి మనం కూడ భాగం పొందువారం కావలెను. అదే విధముగా అల్లాహ్ తాలా ప్రీతిని పొందడం కోసం చేయునట్టి జిహాద్, అల్లాహ్ తాలా ఆదేశాలను అనుసరించునట్టి జిహాద్, పవిత్ర ఖుర్‌ఆన్ యొక్క 700లు లేదా అంతకన్న ఎక్కువ ఆదేశాలకు అనుగుణముగా నడుచుకొను జిహాద్, విశ్వాసాన్ని పటిష్టం చేయునట్టి జిహాద్, అల్లాహ్ తాలా యొక్క సుగుణాలను పొందునట్టి జిహాద్‌లఒ ఎన్నడు కూడ తగ్గుదల రాకుండా చూసుకోవాలి. మన ప్రతి అడుగు ప్రగతి వైపు దూసుకెళ్ళునట్టి అడుగు కావలెను. ఈ రమజాన్ ఇట్టి జిహాద్ కొరకు శంకుస్థాపన కావలెను.

ఈ అంశానికి చెందిన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మరికొన్ని ఉపదేశాలను మరియు ఆధారాలను మీ ముందు ప్రస్తావించెదను. ఈ అంశాన్ని పదే పదే వినాలనిపిస్తుంది. ఒకవేళ ఈ ఉపదేశం మన జీవితంలో ఒక భాగమైనచో మనం ఈ ప్రపంచంలో ఒక విప్లవాన్నే సృష్టించగలము.

హుజూర్ (అ) ఇలా ఉపదేశించారు: " మన ప్రతి పనికి ఒక తప్పని ప్రతిఫలము ఉంటుందని, ఆ ప్రతిఫలము దేవుని ప్రతిచర్యఅని ఏ విధముగానైతే మన ఈ ప్రాపంచిక జీవితంలో ఎంతో స్పష్టముగా మనకు కనిపిస్తుందో అదే విధముగా ధార్మిక విషయంలో కూడ ఈ విధానమే మనకు కనినిస్తుంది. అల్లాహ్ తాలా ఈ రెండు ఉదాహరణలను ఎంతో స్పష్టముగా తెలియజేశాడు. అల్లజీన జహదూ ఫీనా లనహ్‌దియన్నహుం సుబులనా (అన్‌కబూద్:70) ఫలమ్మా జాఘూ అజాఘల్లాహు ఖులూబహుం(అస్సఫ్:6) అనగా ఎవరైతే ఈ పనిని పూర్తి చేస్తారో వారు దేవున్ని అన్వేషించడం కోసం పూర్తి స్థాయిలో ప్రయత్నించినచో అట్టి చర్యకు ప్రతిఫలముగా మేము చేయి పని ఏమిటనగావారికి మేము మా మార్గమును

చూపిస్తాము. ఎవరైతే కౌటిల్యమును ప్రదర్శిస్తారో, సన్మార్గమును అవలంభించడానికి సిద్ధపడరో వారి విషయంలో మా ప్రతిచర్య ఏమిటనగా మేము వారి హృదయాలను ఇంకా వంకరటింకరగా మార్చుతాము. ”

(ఇస్లామీ ఉసూల్‌కీ ఫిలాసఫీ, రూహాని ఖజాయిన్ సంపుటి 10, పుట 389)

ఈ ఆంశాన్నే మరొక కోణంలో హుజూర్ (అ) ఈ విధముగా ప్రస్తావించారు.: అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. ఒకవేళ మా మార్గాన్ని పొందాలనుకున్నచో మీరు జిహాద్ చేసి మా అనుగ్రహాన్ని పొందుచున్నచో ఒక విషయాన్ని ఇక్కడ మీరు గుర్తుంచుకోండి. అదేమనగా దానిలో ఒక చెడు ప్రభావం కూడ ఉన్నది. ఒకవేళ మీరు నా మార్గంలో నడవకున్నచో మీ మనస్సులు వంకర బుద్ధిని కల్గియుంటాయి. అని ప్రతిఫలముగా దుఆలు ఆమోదించబడడంను ఒక వైపు ఉంచినచో అల్లాహ్ మార్గాంలో నడవని ఫలితముగా మీరు షైతాన్ ఒడిలోకి చేరుకుంటారు. షైతాన్ ఒడికి చేరుకున్న మానవుడు తన ధార్మిక మరియు ప్రాపంచికతలు రెండింటిని చెడగొట్టుకుంటాడు. కావున ఈ ఉపదేశంలో ఎక్కడైతే శుభవార్తనివ్వడం జరిగిందో అక్కడే మరియు ఇతర చోట్ల అల్లాహ్ తాలా హెచ్చరించాడు కూడ.

మరొక చోట హుజూర్ (అ) వివరణనిస్తూ ఇలా తెలిపారు: “ మానవ హృదయం పరిపరి విధాల స్థితులను ఎదుర్కొంటుంది. చివరికి అల్లాహ్ తాలా సహృదయుల బలహీనతలను దూరం చేస్తాడు, వారికి పవిత్రమైన, పుణ్యమైన శక్తిని అభిమానంగా అనుగ్రహిస్తాడు. తద్వారా దేవుని దృష్టిలో హేయమైనవన్నియు అతని దృష్టిలో కూడ హేయమవుతాయి. దేవుని దృష్టిలో ప్రియమైన మార్గాలన్నియు అతని దృష్టిలో కూడ ప్రియమైనవిగా కనిపిస్తుంటాయి. అప్పుడు అతనికి బలహీనతయే చేకూరని ఒక శక్తిని అనుగ్రహించడం జరుగుతుంది. అప్పుడు అతనికి ఒక ఉత్సాహం లభిస్తుంది. ఫలితముగా అతనికి ఎన్నడు అలసత్వమే రాదు. అతనికి ఎన్నడు పాపము దరికిచేరని ఒక ధార్మికతను అనుగ్రహించడం జరుగుతుంది. అప్పుడు కరుణామయుడైన అల్లాహ్ ఎంతగా ప్రీతిని పొందుతాడనగా ఆ తరువాత ఎలాంటి పొరపాటు చోటుచేసుకోదు. కాని ఈ అనుగ్రహం చాలా కృషి చేసిన తరువాత లభిస్తుంది. ప్రప్రథమముగా మానవుడు తన బలహీనతల వలన చాలా ఎదురు దెబ్బలను తింటాడు. అధమస్థాయికి దిగజారిపోతాడు. కాని చివరికి అతని సత్యత వలన మహోన్నతమైన శక్తి తన వైపు ఆకర్షించుకుంటుంది. ” అనగా అల్లాహ్ తాలా శక్తి తనవైపు ఆకర్షించుకుంటుంది. “ ఈ విషయం కూడ వైభవోపేతుడైన అల్లాహ్ తెల్పినట్లుగా ఈ సూక్తిని సూచిస్తుంది. వల్లజీన జాహదూ ఫీనా లనహదియన్నహుం సుబులనా ” అరబీలోనే హుజూర్ (అ) ఇలా తెలిపారు: “ నుసబ్బితుహుం అలత్తఖ్వా వల్ ఈమాని వ నహ్‌దియన్నహుం సుబులల్ మహబ్బతి వల్ ఇర్‌ఫాని– వస నుయస్సిరుహుం లిఫిఇలిల్ ఖైరాతి వతరకిల్ ఇస్‌యాని” (తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, సంపుటి 3, పుట 626) అనగా మేము వారికి నిష్టాపరత మరియు విశ్వాసంపై నిలకడగా స్థిరపర్చెదము. తప్పకుండా వారికి అభిమానం మరియు అవగాహనమైన మార్గాల పట్ల మార్గదర్శకం చేయుదుము. వారికి సత్కార్యములు అవలంభించుటకు, పాపములను వీడనాడుటకు అనుగ్రహాన్ని ప్రసాదించెదము.

నేను తెల్పినట్లుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వల్లజీన జాహదూ ఫీనా అను ఆధారం చేసుకోని మనకు విభిన్న కోణాలలో హితోపదేశం చేశారు. మనకోసం విజ్ఞానం మరియు వివేకమైన ద్వారాలను తెరిచారు. ఈ ఆంశాన్ని ఆధారం చేసుకొని వారు తెల్పిన విషయాలు మానవుని స్వభావ రూపాన్ని చిత్రీకరించుతూ వివరించినట్లుగా ఉన్నాయి. మానవుడు ఒకే స్థితిలో ఎప్పుడు స్థిరముగా ఉండదు. మానవ స్వభావంలో ఆటుపోటులు వస్తూనే ఉంటాయి. కాని సత్యస్వభావులు తమ బలహీన స్థితుల నుండి కూడ గుణపాఠంను నేర్చుకుంటారు. ప్రాయశ్చిత్తం, పాశ్చాత్తాపం చేస్తుంటారు. అల్లాహ్ తాలా ఆస్థానంలో మోకరిల్లుతారు. తమ బలహీనతల పట్ల సిగ్గుపడుతూ అల్లాహ్ తాలాను అన్వేషిస్తూ జిహాద్ చేస్తుంటారు. అప్పుడు అల్లాహ్ తాలా ప్రేమ ఉప్పొంగుతుంది. అతని క్షమాగుణం ఉత్సాహం చెందుతుంది. ఫలితముగా అతడు తన దాసుడివైపు పరుగెత్తుకుంటూ వస్తాడు. ఆపై అతనికి పవిత్రత, పుణ్య కర్మల శక్తిని అనుగ్రహిస్తాడు. అప్పుడు మానవునిలో అల్లాహ్ తాలా అనుగ్రహం వలన పవిత్రత, పుణ్యకర్మల శక్తి జనిస్తుంది. ఫలితముగా అతని ప్రతి పని దేవుని ప్రీతిని పోందడం కోసం చేసినదవుతుంది.

అన్ని రకాల బలహీనతలు, అలసత్వాల నుండి అతడు పావనుడైతాడు. ధార్మికతను అనుసరించువాడు అవుతాడు. పాపముల నుండి రక్షించబడువాడు అవుతాడు. ఆ తరువాత దేవునికి కోపం తెచ్చునట్టి ఏ పనినిగాని, ఏ తప్పునుగాని జరుగకుండా చూసుకొంటూకేవలం అల్లాహ్ తాలా ప్రీతిని పొందుటకు ప్రయత్నించు వ్యక్తిగా మారిపోతుంటాడు. హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు: కాని గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, ఈ స్థితిని పొందడానికి నిరంతరం తప్పకుండా కృషి చేయవలసి ఉంటుంది. తాత్కాలిక కృషి కాదు. శాశ్వతమైన కృషిని చేయాలి. అప్పుడే సత్కార్యముల మరియు దుఆల ఆమోధిత దృశ్యాలు జీవితంలో భాగమైపోతాయి.

మరొకచోట హుజూర్ (అ) ఇలా తెలిపారు: మా మార్గం కోసం ఎవరైన ప్రయత్నిస్తారో వారికి మేము మేము మా మార్గంను చూపుతాము. ఇలా అన్నారు. ఇది వాగ్దానం. ఆపై మనకు ఈ దుఆను కూడ అనగా ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమను నేర్పించడం జరిగింది. కావున మానవుడు ఈ ఆంశాలను దృష్టియందుంచుకొని ఆర్తనాధాలతో దుఆ చేయవలెను. ఆపై ప్రగతి మరియు వివేకతను సాధించిన వారిలో చేరిపోవాలనే ఆకాంక్షను కూడ కల్గియుండాలి. అంతేగాని ఈ ప్రపంచం నుండి అవివేకుడిగా, అంధుడిగా మాత్రం కాలయానం చేయకూడదు.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 20, ఎడిషన్ 1984)

ఈ స్థాయిని చేరుకోడానికి అల్లాహ్ తాలా తన దాసుడికి తన మార్గంను గూర్చి మార్గదర్శకం చేయడమేగాకుండా దుఆను కూడ నేర్పించాడు. కావున ఫాతియా అధ్యాయమును పఠించునప్పుడు ఈ దుఆను అనగా ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమను పదే పదే పఠించవలెను. ఖాదియాన్‌కు చెందిన ఒక ఘటన ఇది. నమాజ్ సల్పునప్పుడు ఒక మహాత్ముని పరిస్థితి ఎలా ఉంటుంది? అనే విశయాన్ని ఒకరు వినిపించారు. వారు ఇలా తెలిపారు. హజ్రత్ మసీహ్‌మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఒక అనుచరుడు మస్జిద్ ముబారక్‌లోని ఒక మూలకు నిలబడి నమాజ్ సల్పుచున్నాడు. చాలా దైవభీతి, ఉద్వేగతకు లోనైయ్యాడు. చాలా సమయం వరకు చేతులు కట్టుకొని నిలబడేయున్నాడు. తెలికపాటి శబ్ధాలు కూడ వినబడుతున్నాయి కావున ఏమి చదువుతున్నాడో ప్రక్కన నిలబడి తెలుసుకోవాలనే అతృత కల్గింది. వెళ్ళగా పదే పదే ఇహ్‌దిన్నస్సిరాతల్ ముస్తఖీమ, ఇహ్‌దిన్నస్సిరాతల్ ముస్తఖీమా అని పదే పదే ఉచ్చరించసాగాడు. పైగా ఉద్వేగానికి కూడ లోనైయ్యారు. కావున మానవుడు తన మార్గదర్శకం కోసం ఈ దుఆను అధికముగా ఉచ్చరిస్తూ ఉండాలి.

మరల హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు: “ దేవుని సత్యవాగ్ధానం ఏమిటనగా, ఎవరైతే సహృదయంతో, సత్య సంకల్పంతో అతని మార్గం కోసం అన్వేషణ కొనసాగిస్తారో” అతడు వారి కొరకు మార్గదర్శకానికి మరియు వివేకానికి చెందిన మార్గాలను వారికొరకు తెరుస్తాడు. “ఏ విధముగానైతే అతడే స్వయముగా తెలిపాడో వల్లజీన జాహదూ ఫీనా లనహ్‌దియన్నహుం సుబులనా అనగా ఎవరైతే మాలో ఒకరిగా ఉంటూ అన్వేషణ ప్రారంభిస్తారో వారికోసం మేము మా మార్గలను తెరిచి ఉంచుతాము. మాలో ఒకరిగా అనగా కేవలం స్వచ్ఛతతో, సద్భావనతోదేవున్ని పొందాలనే ఏకైక లక్ష్యమును కల్గియుండాలి. ” మనము దేవున్ని పొందాలని ప్రయత్నిస్తుంటారు. అంతేగాని ఎలాంటి ప్రాపంచిక ఉద్దేశము ఉండకూడదు. నిజానికి దేవున్ని పొందాలనే ఉద్దేశమే ఉండాలి. స్వచ్ఛతతో దేవున్ని పొందాలనే ఉద్దేశాన్ని కల్గియుండాలి. “కాని ఎవరైన ఎగతాళి, అవహేళన రూపంలో కేవలం పరీక్షించుటకు ప్రయత్నించినచో అట్టి దురదృష్టవంతుడు కోల్పోతాడు. ” మరల ఇలా అన్నారు: “ కావున ఈ పవిత్ర సూత్రంను అనుసరించి ఒకవేళ మీరు స్వచ్ఛమైన మనస్సుతో ప్రయత్నించినచో ఆపై దుఆలు చేసినచో అతడు క్షమాగుణ ప్రపూర్ణుడు. ఒకవేళ ఎవరైనే అల్లాహ్‌ను పట్టించుకోనిచో అల్లాహ్ కూడ స్వయంభువు. ”

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 439, ఎడిషన్ 1984) అనగా అల్లాహ్‌కు కూడ మీతో ఎలాంటి పనిలేదు.

మరల వారు ఇలా తెలిపారు: “ ప్రపంచంలో ఉన్నటు వంటి కార్యకలాపాలు అన్నింటిలో మానవుడే ముందుగా ఏంతో కొంత పని చేయవలసి ఉంటుంది.” ప్రపంచ పనులలో మానవుడు ముందుగా తన వంతుగా ప్రయత్నించవలసి ఉంటుంది. సాధారణగా ప్రాపంచిక పనులలో మనం ఈ దృశ్యాలను చూస్తుంటాము. ప్రపంచంలో ఇలాంటి ఉదాహరణలు కన్పిస్తుంటాయి. “మానవుడు కాళ్ళు చేతులు కదలాడించినప్పుడే అల్లాహ్ తాలా కూడ శుభములను అనుగ్రహిస్తాడు. ఆ విధముగానే ఏవరైతే కృషి చేస్తుంటారో వారే అల్లాహ్ తాలా మార్గంలో ప్రావీణ్యతను సాధిస్తుంటారు. అందుకే ఇలా అన్నాడు. వల్లజీనా జాహదూ ఫీనా లనహ్‌దియ్యన్నహుం సుబులనా మొత్తానికి ప్రయత్నించాలి. ఎందుకనగా కృషియే

విజయానికి నాంది.

(మల్ఫూజాత్ సంపుటి 7, పుట 224, ఎడిషన్ 1984)

మన ప్రాపంచిక ప్రయోజనాల కోసం మనం శక్తికి మించిన ప్రయత్నాలు చేస్తుంటాము. అలాంటప్పుడు మనం దేవున్ని పొందడం కోసం, దేవుని మార్గంను తెలుసుకోవడం కోసం ఎందుకు ఆ స్థాయిలో ప్రయత్నించడం లేదు. మనం నోటితో కొద్దిగా గుర్తుంచుకోగానే వెంటనే మనకు అల్లాహ్ దొరికిపోతాడని, మన దుఆలను స్వీకరిస్తాడని ఎలా భావించగలరు?. కావున ఇక్కడ కూడ అదే అంశం వచ్చింది. మా దుఆలు స్వీకరించబడడం లేదని ఫిర్యాదు చేయువారు ముందుగా తమను తాముగా పరిశీలించుకోవాలి. అంతేగాని దేవున్ని పొందడానికి శరీరం అలసిపోకుండా ప్రయత్నిస్తూ, ప్రాపంచిక ప్రయోజనాల కోసం శరీరం తునాతునకలు అయ్యేవిధముగా కష్టపడడం సరికాదు. ఈ సూత్రాన్ని అన్ని చోట్ల ఆచరించాలి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరొక చోట ఈ విషయాన్నే అనగా అల్లాహ్ తాలాను పొందడానికి కృషి చేయవలసి ఉంటుందనే విషయాన్ని ఈ విధముగా తెలిపారు. " ఎవరైతే మా మార్గం కోసం ప్రయత్నిస్తారో చివరికి వారు మార్గదర్శకంను పొందుతారు. ఏ విధముగానైతే విత్తానాన్ని విత్తిన తరువాత కలుపుతీసి నీళ్ళుపెట్టకుండా ఉన్నచో అది మాడిపోయి, చచ్చిపోతుందో అదే విధముగా మీరు కూడ ఈ అంగీకారాన్ని గుర్తు చేసుకుంటూ ఓ దేవుడా! మాకు సహాయంను అందించుము అని దుఆలు చేయనిచో దైవానుగ్రహం లభించదు. ఫలితముగా దైవానుగ్రహం లేకుండా మార్పుయే సాధ్యం కాదు."

(మల్ఫూజాత్ సంపుటి 7, పుట 225, ఎడిషన్ 1984)

ఇది సృష్టి ధర్మం. అల్లాహ్ తాలాను పొందడానికి కూడ ఈ ధర్మాన్ని తప్పకుండా అనుసరించవలసి ఉంటుంది. ఏ విధముగానైతే ఒక రైతు విత్తనాలను విత్తి చేతులు ముడుచుకొని కూర్చుండిపోడో అదే విధముగా ఇక్కడ కూడ మానవుడు నేను విశ్వసించాను కదా!, నేను నమ్మినాను కదా! అని కూర్చున్నచో ఎలాంటి ప్రయోజనం చేకూరదు. తప్పకుండా ప్రయత్నించాలి. తమ విశ్వాస మొక్కలను ఎల్లవేళల రక్షించుకొనుటకు ప్రయత్నించాలి.

మరల వారు ఇలా తెలిపారు: " ఎవరైతే దేవుని వైపు మ్రొగ్గు చూపుతారో అల్లాహ్ తాలా కూడ వారివైపే మ్రొగ్గుచూపుతాడు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా సాధ్యమైనంత వరకు అతడు తనకు తానుగా నిర్లక్ష్యం చేయకూడదు. అలా అతని ప్రయత్నం ఉన్నత స్థాయికి చేరుకున్నచో అప్పుడు అతడు దేవుని తేజస్సును దర్శించుకుంటాడు. వల్లజీనా జాహదూ ఫీనా లనహ్దియన్నహుం సుబులనా లో " మరల ఇలా తెలిపారు: " ఈ అంశంను గూర్చి తెల్పబడింది. అనగా అతడు చేయవలసిన ప్రయత్నంను తప్పకుండా చేయవలెను. అంతేగాని 20 అడుగుల లోతులో నీళ్ళు పడుతాయని తెలిసినా కూడ కేవలం రెండు అడుగుల లోతు త్రవ్వి అలసిపోకూడదు." 20 అడుగులు లేదా 30 అడుగుల లోతు త్రవ్వినచో నీళ్ళు పడే అవకాశం ఉన్నచో 4 లేదా 5 అడుగులు త్రవ్వి కూర్చోకూడదు. మరల ఇలా తెలిపారు. "ప్రతి పనిలో దాగిఉన్న ఆంతర్యమేనగా మనోధైర్యాన్ని కోల్పోకూడదు.

మరల ఇలా తెలిపారు: ఈ సమాజంను గూర్చి అల్లాహ్ తాలా వాగ్దానం కూడ చేశాడు. అదేమనగా ఎవరైన పూర్తి స్థాయిలో దుఆలు చేస్తూ, మనో పవిత్రతను పాటించినచో పవిత్ర ఖుర్ఆన్‌లో చేయబడిన వాగ్దానాలన్నియు అతని పక్షంలో పూర్తి చేయబడుతాయి. " ఎవరైతే ధైర్యంతో పూర్తి స్థాయిలో దుఆలు, ఆత్మ పరిశీలన చేసుకుంటూ ముందుకు వెళ్ళుతారో వారి విషయంలో పవిత్ర ఖుర్ఆన్ వాగ్దానాలన్నియు పూర్తి చేయబడుతాయి. "ఆ ఎవరైతే భిన్నముగా నడుచుకుంటారో వారు కోల్పోతారు. ఎందుకనగా అల్లాహ్ స్వాభిమానవంతుడు. అతడు తన వైపు రావడానికి తగిన మార్గాన్ని తెరిచి ఉంచాడు. కాని ఆ మార్గపు ద్వారాన్ని ఇరుకుగా అమర్చాడు. కావున ఎవరైతే కష్టాలతో కూడిన పానియాన్ని సేవించెదరో వారే అందులో నుండి ప్రవేశించగలరు." శ్రమించవలసి ఉంటుంది. "ప్రజలు ప్రాపంచిక వ్యవహారంలో కష్టనష్టాలను భరిస్తుంటారు. " ఇలా తెలిపారు. ప్రజలు ప్రపంచ సాధికారత కోసం బాధలన్నింటిని భరిస్తుంటారు. " కొందరైతే ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంటారు. కాని అల్లాహ్ తాలా కోసం ఒక ముల్లు వలన కల్గే బాధను కూడ భరించుటకు ఇష్టపడరు. కావున ఎప్పటి వరకైతే అతని వైపు నుండి సత్యత, సహనం మరియు విధేయతతో కూడిన సంకేతాలు బహిర్గతం కావో" అనగా దాసుడి నుండి స్వచ్ఛత, సహనం, విధేయతతో కూడిన సంకేతాలు బహిర్గతం కావో "అప్పటి వరకు అల్లాహ్ తాలా వైపు నుండి కూడ కరుణా ప్రపూర్ణతతోకూడిన సంకేతాలు కూడ బహిర్గతం కావు. " మరల ఇలా అన్నారు. "అటు వైపు నుండి కరుణా ప్రపూర్ణ సంకేతాలు ఎలా బహిర్గతం కాగలవు?. " (మల్ఫూజాత్ సంపుటి 7, పుట 291, ఎడిషన్ 1984) మేము చాలా దుఆలు చేశాము కాని మా దుఆలు స్వీకరించబడలేదు అని ప్రశ్నించేవారికి ఇది సమాధానం. ఒకవిధముగా వారు అల్లాహ్ తాలా విషయంలో నిబంధనను విధిస్తున్నారు. మేము దేవుని వద్దకు మా ఇష్టాను సారమే వస్తాము. అవసరము వచ్చినప్పుడే వస్తాము. దేవుడు మా నిబంధనకు లోబడి యున్నాడు (నవూజ్ బిల్లాహ్). మేము ఏమి కోరుకున్నా, ఎలా కోరుకున్నా అతడు మాత్రం మా దుఆలను ఆమోదించాలి అని భావిస్తుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పినట్లుగా ఇలాంటి వారిని చూసినచో ప్రాపంచిక చట్టాల విషయంలో, సత్సంబంధాల విషయంలో అలానే ఎందుకు భావించారు. కేవలం అల్లాహ్ తాలా విషయంలోనే అలా ఎందుకు భావిస్తుంటారు?. మేము కోరుకున్న విధముగా, ఎలాంటి శ్రమలేకుండానే జరిగిపోవాలని ఎలా భావిస్తుంటారు. అందుకే ఇక్కడ ఈ విధముగా తెలిపారు. స్వచ్ఛతతో అల్లాహ్ వైపుకు రమ్ము. అప్పుడే అతని ప్రేమపూర్వక దృశ్యాలను చూడగల్గుతారు.

మరల వారు (అ) ఇలా తెల్పుచున్నారు: "ఆచరణలు లేని విశ్వాసం నీటి కాలువలు లేని తోట వంటింది." నీటి కాలువలు, నదులు లేని తోటవంటింది. "మొక్కలను నాటిని తరువాత తోటమాలి వాటికి నీటిని పారించకుండ ఉన్నచో ఆ మొక్కలు ఒక రోజు తప్పకుండా ఎండిపోతాయి. విశ్వాస పరిస్థితి కూడ అలాంటిదే. వల్లజీనా జాహదూ ఫీనా అనగా మీరు చిన్న చిన్న పనుల వరకే పరిమితం కాకండి, ఈ మార్గంలో పెద్ద పెద్ద త్యాగాలను చేయవలసి ఉంటుంది. మనస్సును ఎద్దుతో పోల్చదమైనది. "

(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంపుటి 3, పుట 631)

అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. వల్‌యూమినూ బీ నన్ను పిలుచు వారు నన్ను విశ్వసించవలెను. విశ్వాసం అనగా దేవుని హక్కులను, అతని దాసుల హక్కులను చెల్లిస్తూ అల్లాహ్ తాలాపై విశ్వాసపు హక్కును కూడ చెల్లించుము. అల్లాహ్ తాలా విశ్వాసపు తోటయొక్క సంరక్షణ మరియు పర్యవేక్షణ బాధ్యతలను తన దాసులకు అప్పగించును. మనం మన ఇళ్ళలో కూడ చూస్తుంటాము. మొక్కలను మనం ప్రతిరోజు సరిగా చూసుకోకుండా ఉన్నచో, వాటికి తీసుకోవలసిన శ్రద్ధ తీసుకోనిచో అవి మాడిపోతాయి. కావున మనం విశ్వాసపు తోటను పర్యవేక్షణయే లేకుండా ఎలా వదిలి వేయగలము. మరల మరో విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. " మా మార్గం కోసం పరితపించుతూ ప్రయత్నించు వారు తప్పకుండా పొందుతారు. " దీని అర్థమేమనగా ఈ మార్గంలో దైవ ప్రవక్తలతో కలసి మెలసి పోరాడ వలసి ఉంటుంది. ఒకటి రెండు గంటల తరువాత పారిపోవడం వంటివి యుద్ధ వీరుడి లక్షణం కాదు. ప్రాణాలను అర్పించుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండాలి. కావున నిష్టాపరుడి సంకేతం స్థిరత్వం."

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 25, ఎడిషన్ 1984)

కావున మనం బైఅత్ వాగ్దానంలో మేము ధార్మికతకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇస్తాము అని వాగ్దానం చేసినప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చుటకై మనం ప్రాధాన్యతను ఇవ్వవలసిన ఆ ధర్మం మన నుండి ఏమి కోరుకుంటుంది? అనే విషయాన్ని కూడ చూడవలసి ఉంటుంది. ఆ తరువాత ఒక స్థిర స్వభావంతో దానిని ఆచరించవలసి ఉంటుంది.

మరల వారు ఇలా తెలిపారు: " ఎవరైతే అల్లాహ్ తాలాకు భయపడుతూ అతని మార్గం కోసం అన్వేషణ ప్రారంభివస్తాడో, ఈ అన్వేషణ నేరవేరుటకు అతనితో దుఆలు చేస్తాడో అతనికి అల్లాహ్ తాలా తన చట్టాన్ని అనుసరించి (వల్లజీనా జాహదూ ఫీనా లనహదియ్యన్నహుం సుబులనా అనగా ఎవరైతే మాలో ఒకరిగా ఉంటూ మాకోసం ప్రయత్నిస్తారో వారి కొరకు మేము మా మార్గములను వారికి చూపిస్తాము.) స్వయముగా చేతిని పట్టుకొని మార్గమును చూపిస్తాడు. ఆపై వారికి మనశ్శాంతిని కూడ చేకూర్చుతాడు. కాని ఒకవేళ అతని మనస్సుఅంధాకారంతో నిండి యున్నచో, నాలుక దుఆ చేయడాన్ని భారంగా భావించుచున్నచో, ఆ పై విశ్వాసంలో అన్యారాధన, దురాచారాలకలయికలు ఉన్నచో " సిద్ధాంత పరంగా అన్యారాధన మరియు దురాచారములు కలసియున్నచో "అది దుఆ అనబడదు. అదే విధముగా ఉత్తమ ప్రతిఫలములే అందని ఆ యాచన యాచనయే అనబడదు. "

(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, సంపుటి 3, పుట 632)

కావున మనం ఈ విధ మైన ఆలోచనలతో అల్లాహ్ తాలా మార్గములను అన్వేషిస్తున్నామా? మన మనస్సులు అల్లాహేతరుల నుండి పూర్తిగా ఖాళీ అయ్యాయా? అని మనలను మనం పరిశీలించుకోని చూసుకుంటూ ఉండాలి.

ఆ తరువాత ప్రాయశ్చిత్తము, పాశ్చాత్తాపముల వైపు శ్రద్ధ చూపవలెనని తెల్పుచూ వారు (అ) ఇలా అన్నారు. " ప్రాయశ్చిత్తము మరియు పాశ్చాత్తాపములు దైవాన్ని పొందుటకు సాధనాలు. అల్లాహ్ తాలా ఇలా తెల్పినాడు. వల్లజీనా జాహదూ ఫీనా లనహదియన్నహుం సుబులనా పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తూ అతని మార్గంలో నడుస్తుండాలి. లక్ష్యంను చేరుకోవాలి. అల్లాహ్ తాలా ఎవరి విషయంలో లోబితనంను చూపడు."

(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 107)

మరల ఇలా అన్నారు: " పవిత్ర ఖుర్ఆన్ బోధనల అనుసారం చూసినచో మనకు ఈ విషయం ఈవిధముగా అర్ధమవుతుంది. అదేమనగా ఒక వైపు అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో తన దయ, కరుణ, సారస్యము, అనుగ్రహపు విశిష్ట లక్షణాలను గూర్చి ప్రస్తావించాడు. అతని దయాగుణంను బహిర్గతం చేస్తున్నాడు. మరోవైపు ఇలా అన్నాడు. అన్‌ల్లయిస లిల్ ఇన్‌సాని ఇల్లా మా సాఅ (నజమ్:40) మరియు వల్లజీనా జాహదూ ఫీనా లనహ్‌దియ్యన్నహుం సుబులనా తెలిపి తన అనుగ్రహాన్ని ప్రయత్నం మరియు కృషితో ముడిపెట్టినాడు. ఆపై ఇందుకు అనుచర వర్గీయులు రజియల్లాహు అన్‌హుం గారి విధానంను మనం కోసం ఒక ఆదర్శంగా పేర్కొన్నాడు. కావున అనుచరుల జీవితాన్ని క్షుణ్ణముగా పరిశీలించి చూడుము. వారు కేవలం ఈ నమాజ్‌లతోనే అంత గొప్ప ఉన్నత స్థాయికి చేరుకున్నారా? కాదు . వారు దేవుని ప్రీతిని పొందడం కోసం తమ ప్రాణాలను కూడ లెక్కచేయలేదు. మేకలు గొర్రలవలే దైవ మార్గంలో కోయబడ్డారు. అప్పుడే వారికి ఆ స్థాయి దక్కింది. " మరల ఇలా తెలిపారు. " మేము అధికులను చూశాము. ఒకే ఒక ఊదుతో వారిని ఆయా స్థానలకు చేర్పించాలని, అదే విధముగా అల్లాహ్ తాలాతో సంభాషణల పరంపర కొనసాగించినట్లు చేయాలని ఆశిస్తుంటారు. " (మల్ఫూజాత్ సంపుటి 10, పుట 205, ఎడిషన్ 1984) ఇలా ఎన్నడు సాధ్యం కాదు.

నిశ్చయముగా అల్లాహ్ తాలా దయామయుడు, కరుణామూర్తి. కాని వాటికి తోడుగా అతడు సంపూర్ణ విశ్వాసం పొందువారికోసం ఒక నిబంధనను ఏర్పర్చినాడు. అదేమనగా వారు అతని మార్గంలో జిహాద్ చేయవలెను. అప్పుడే అల్లాహ్ తాలా వారి స్థాయిని పెంచుతూ పోతాడు. దుఆల ఆమోదపు దృశ్యాలను కూడ వారు చూస్తారు. అనుచరులు చూసినట్లుగా వారు కూడఅల్లాహ్ తాలా యొక్క కరుణా, దయాల మహాత్యముల దృశ్యాలను గతంలో కన్న ఎక్కువగా చూస్తారు. అసాధారణమైన ఉదాహారణలను స్థాపించుతూ అల్లాహ్ తాలా ప్రేమలో మునిగిపోతారు. ఒకవేళ అల్లాహ్ తాలా మార్గంలో మరణించినా కూడ వారు స్వర్గము మరియు అతని ప్రీతిని పొందు శుభవార్తలను పొందువారగుదురు.

మరల ఇలా తెలిపారు: " ఎవరైతే దేవునిలో లీనమై, దేవున్ని పొందడానికి తల్లడిల్లిపోతుంటారో, పూర్తి భక్తిశ్రద్ధలతో ప్రయత్నిస్తుంటారో వారి కృషిని, వారి ప్రయత్నాన్ని అల్లాహ్ తాలా ఎన్నడు వృధా చేయడు. తప్పకుండా వారికి మార్గదర్శకం మరియు సన్మార్గంను చూపుతాడు. ఎవరైతే స్వచ్ఛతతో, నిజాయితితో అల్లాహ్ తాలా వైపు అడుగులు వేస్తారో వారికి సన్మార్గం చూపడం కోసం అల్లాహ్ తాలాయే స్వయముగా వారివైపు అడుగులు వేస్తుంటాడు. క్షుణ్ణంగా పరిశీలించడం మానవుని విధి. నిష్కల్మశమైన మనస్థత్వంతో సత్యాన్ని యాచించు ఆవేధనను, ప్రేమను తనలో జనింపజేసుకోవాలి. తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం కోసం అల్లాహ్ తాలా చూపిన విధానాలను తప్పకుండా పాటించాలి. అల్లాహ్‌ను పట్టించుకోని వ్యక్తి విషయంలో అల్లాహ్ కూడ అతనిని పట్టించుకోడు. "

(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 284, ఎడిషన్ 1984)

మరల వారు (అ) ఇలా తెలిపారు: " తమ మనస్సును మార్చుకోవడం కోసం ప్రయత్నించుము." ప్రయత్నించవలెను. "నమాజ్‌లలో దుఆలు చేయండి. ధాన ధర్మాలు మరియు ఇతర సత్కార్యముల ద్వారా వల్లజీనా జాహదూ ఫీనాలో పాల్గొనండి. ఏ విధముగానైతే అస్వస్థతకు గురైన వ్యక్తి వైద్యుని వద్దకు వెళ్ళుతాడో , మందులను తీసుకుంటాడో, చికిత్స చేయించుకుంటాడో, రక్త పరిక్షలు చేయించుకుంటాడు, సలహాలు, సూచనలు పాటిస్తుంటాడు. స్వస్థత పొందడం కోసం అన్ని రకాలుగా ప్రయత్నిస్తుంటాడో. అదే విధముగా తమ ఆధ్యాత్మిక అస్వస్థతను దూరం చేసుకోవడం కోసం కూడ అన్ని రకాలుగా ప్రయత్నించాలి. కేవలం నోటి మాటలతో కాకుండా కృషి ద్వారా ప్రయత్నించాలి. అల్లాహ్ తాలా తెల్పిన విధానాలన్నింటిని అనుసరించి చూడుము. (మల్ఫూజాత్ సంపుటి 8, పుట 188, ఎడిషన్ 1984) ఇది అల్లాహ్ తాలాను పొందు మార్గాలు తెరుచుకొను విధానం. ఆపై ఈ విధానం దుఆల వైపు కూడ శ్రద్ధను కల్పిస్తుంది.

మరల వారు ఈ విధముగా తెలిపారు: "మానవుడు ఈ (ప్రాపంచిక) జీవితాన్ని ఒక మలిన జీవితంగా భావించి దానిని నుండి మోక్షం పొందుటకు ప్రయత్నించవలెను." అనగా ఈ జీవితమే పరామార్థంగా భావించకూడదు. ఇది కేవలం తాత్కాలికమైన, అపరిశుద్ధ జీవితం. " ఇందుకు దుఆలు చేయుము. ఎందుకనగా అతడు నిజంగా ప్రయత్నిస్తూ, స్వచ్ఛమైన మనస్సుతో దుఆలు చేసినచో చివరికి అల్లాహ్ తాలా అతనికి మోక్షాన్ని ప్రపాదిస్తాడు. అలా వారు పాపపు జీవితం నుండి బయటికి వస్తారు. ఎందుకనగా దుఆ ఒక సాధారణమైన సాధనం కాదు. అది కూడ ఒక మరణం లాంటింది. ఆ మరణాన్ని మానవుడు స్వీకరించినప్పుడు మరణాన్ని తలపించు అతని తప్పుఒప్పుల జీవితం నుండి అతన్ని కాపాడుతాడు. అతనికి ఒక పవిత్రమైన జీవితాన్ని అందిస్తాడు. " మరల ఇలా తెలిపారు "అనేకులు దుఆను సాధారణముగా చూస్తుంటారు. కావున గుర్తుంచుకోవలసిన విషయమేమనగా నమాజ్ చదివిన తరువాత చేతులు ఎత్తి కూర్చొవడం, నోటి ఏది వస్తే దానిని చదవడం దుఆ అనబడదు. అలాంటి దుఆల వలన ఎలాంటి ప్రయోజనం చేకూరదు. ఎందుకనగా ఈ దుఆ కేవలం ఒక మంత్రం లాంటిదే. అందులో మనస్సు నిమగ్నం కాదు, దేవుని శక్తులు, సామార్థ్యములపై ఎలాంటి విశ్వాసం బహిర్గతం కాదు.

మరల గుర్తుంచుకోండి. దుఆ ఒక మరణం. మరణ సమయంలో ఏ విధముగానైతే తల్లడిల్లిపోతుంటారో, ఆవేధన చెందుతారో అదే విధముగా దుఆల కోసం కూడ తల్లడిల్లిపోతుండాలి, ఆవేధన చెందాలి. ఉత్సాహం ఉండాలి. అందుకే దుఆలో ఎప్పటి వరకైతే తపన, భక్తి ఉండవో అప్పటి వరకు ఆ దుఆ పని చేయదు. అందుకే రాత్రివేళలో మేల్కొని ఎంతో ధీనంగా, అవేధనతో, ఆందోళనతో దేవుని ముందు మీ సమస్యలను విన్నవించుకోండి, ఆ క్రమంలోనే మరణంను చేరుకొను స్థాయికి దుఆను చేర్చండి. అప్పుడే దుఆ ఆమోదింపబడు స్థాయికి చేరుకుంటుంది. "

మరల ఇలా తెలిపారు: " గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా, అన్నింటి కన్న ముందుగా మానవుడు తనను తాను పాపాముల నుండి దూరంగా ఉండడం కోసం దుఆలు చేసుకోవాలి. దుఆల సారాంశం, లక్ష్యము ఇదే. ఎందుకనగా ఈ దుఆ ఆమోదించబడినచో మానవుడు అన్ని రకాల చెడులు, దుశ్చర్యల నుండి దూరముగా ఉంటూ దేవుని దృష్టిలో పరిశుద్ధుడిగా నిలుస్తాడు. అప్పుడు అతని అవసరాలకు అనుగుణమైన ఇతర దుఆలను చేయవలసిన అవసరం అతనికి ఏ మాత్రం రాదు. " అనగా మానవుని ఇతర ప్రాపంచిక అవసరాల కోసం చేయునట్టి దుఆలు. " వాటికి అవి ఆమోదించబడుతాయి. పాపముల నుండి కాపాడుకొనబడు దుఆలే చాలా క్లిష్టమైనవి, శ్రమను కోరుకుంటాయి. " మానవుడు తనను పాపాముల నుండి కాపాడమని చేయు దుఆయే అన్నిటి కంటే గొప్ప దుఆ." దేవుని దృష్టిలో నిష్పాపరుడిగా, సంస్కారవంతుడిగా నిలవాలి. అనగా మొట్ట మొదట మానవుని హృదయంపై ఉన్నటు వంటి తెర తప్పకుండా దూరం కావలెను. ఎప్పుడైతే అ తెర దూరమవుతుందో అప్పుడు ఇతర తెరలను దూరంచేయడానికి అంతగా కష్టపడాల్సిన అవసరం ఏమి ఉండదు. ఎందుకనగా దేవుని అనుగ్రహం అతన్ని వెన్నంటి ఉంటుంది. ఫలితముగా వేలాది చెడులు వాటికి అవియే దూరమవుతాయి. మనస్సుతో పవిత్రత, పరిశుద్ధత జనించినచో అల్లాహ్ తాలాతో స్వచ్ఛమైన అనుబంధం ఏర్పడుతుంది. ఫలితముగా అల్లాహ్ తాలాయే స్వయముగా అతని పోషకుడిగా, మిత్రుడిగా నిలుస్తాడు. అప్పుడు అతడు అల్లాహ్ తాలాతో అతని అవసరాన్ని గూర్చి అడగడానికి ముందే అల్లాహ్ తాలా అతని అవసరాన్ని తీర్చుతాడు. ఇదొక సూక్ష్మమైన రహస్యం. ఇది కూడ అప్పుడే బయటపడుతుంది." ఇది చాలా గోప్యమైన రహస్యం. ఈ రహస్యం అప్పుడే బయటకు వస్తుంది. " మానవుడు ఆ స్థితికి చేరుకున్న తరువాత ఈ విషయం అర్ధమవుతుంది. అంతకు ముందు ఈ విషయం అతనికి అర్థంకావడం చాలా కష్టం. కాని ఇదొక చాలా గొప్ప కృషిని కోరుకుంటుంది. ఎందుకనగా దుఆ కూడ ఒక కృషిని కోరుకుంటుంది. కావున ఎవరైతే దుఆ లెక్కచేయకుండా ఉంటాడో, దుఆల నుండి దూరంగా ఉంటాడో అలాంటి వ్యక్తిని గూర్చి అల్లాహ్ తాలా కూడ పట్టించుకోడు. పైగా అతని నుండి దూరముగా ఉంటాడు. తొందరపాటు, అతి తెలివి ఇక్కడ పనిచేయవు. అల్లాహ్ తాలా తన దయానుగ్రహాలతో తాను కోరినది చేయగల సమర్థుడు. ఎప్పుడు పడితే అప్పుడు అనుగ్రహించవచ్చును. అంతేగాని యాచించువారు యాచించిన వెంటనే లభించనిచో ఆ విషయంలో ఫిర్యాదు మరియు ఆపోహకు గురి కాకుండా స్థిరత్వంతో నిలకడగా యాచిస్తూనే ఉండాలి. "

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 406-407, ఎడిషన్ 1984)

అల్లాహ్ తాలా ఈ ఆంశాలను ఆచరించు భాగ్యమును మనకు ప్రసాదించు గాకా!. ఈ రమజాన్‌ను మనకు అల్లాహ్ తాలాతో ఒక పటిష్ట అనుబంధాన్ని

ఏర్పర్చునదిగా చేయుగాకా!. అతని ఆదేశాలను ఆచరించు వారిగా మార్చుగాకా!. అతనిని సంపూర్ణముగా విశ్వసించు వారిగా చేయుగాకా!. దుఆల ఆమోదిత దృశ్యాలను చూచు భాగ్యమును కల్పించుగాకా!. ఈ స్థితి ఎల్లప్పుడు శాశ్వతముగా కొనసాగును గాకా!. రమజాన్‌లో మరియు రమజాన్ తరువాత కూడ మనం అల్లాహ్ తాలా యొక్క ప్రత్యేక దాసుడిగా కొనసాగునట్లుగా నడుచుకొను భాగ్యాన్ని కల్పించుగాకా!. అల్లాహ్ తాలా మనకు తన మార్గములను చూపించు గాకా!. వాటి నుండి మనం ఎన్నడు దారి తప్పకుండా ఉందుము గాకా!. ఎల్లప్పుడు అతని ప్రేమ పూర్వకమైన చూపు మనపై కురిపించుగాకా!. మనం నేటి కాలపు ఇమాం బైఅత్ హక్కును నెరవేర్చువారం అవుదుము గాకా!. అల్లాహ్ తాలా ఈ అనుగ్రహాన్ని పొంది తరువాత ఎన్నడు దానిని కోల్పోకుండా చూడును గాకా!. నేటి కాలపు ఇమాంను విశ్వసించడం వలన అతడు అనుగ్రహాన్ని ప్రసాదించాడు. అల్లాహ్ తాలా మన వ్యతిరేకుల మరియు శత్రువుల దుష్టత్వముల నుండి ఎల్లప్పుడు కాపాడును గాకా!. ఈ రమజాన్‌ను తమ దుఆల ఆమోదిత మాసంగా తీర్చుదిద్దుకోవాలి. అల్లాహ్ తాలా ఇందుకు మనకు భాగ్యాన్ని ప్రసాదించుగాకా!.

ప్రపంచ పరిస్థితుల కోసం దుఆలు చేయండి. అల్లాహ్ తాలా ప్రపంచాన్ని వినాశనకారుల నుండి కాపాడుగాకా!. వారికి తెలివి తేటలను కూడ ప్రసాదించును గాకా! వారు తమ సృష్టికర్తను గుర్తించుదురు గాకా!.

జుమా నమాజ్ తరువాత నేను ఎం.టి.ఏ కు చెందిన ఒక వెబ్‌సైట్‌ను కూడ ప్రారంభిస్తాను. దీనిని ఎం.టి.ఏ ఇంటర్నేష్నల్ వారు తయారు చేశారు. దీనికి చెందిన మొబైల్ అప్లికేషన్ వారు తయారు చేశారు. అందులో 313 బద్రీ అనుచరులు రజియల్లాహు అన్‌హుంలను గూర్చినా నా జుమా ప్రసంగాలను ఒకచోట చేర్చినారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఆయా అనుచరులను గూర్చి చదవడమే గాకుండా వారి వారి ప్రొఫైల్స్‌ను కూడ చదవ వచ్చును. ఎక్కడివరకైతే చదివారో అక్కడి వరకు బుక్‌మార్క్‌ను కూడ పెట్టుకోవచ్చును. అంతేగాకా అనుచరులను గూర్చి ప్రశ్నోత్తరాలతో కూడిన ఒక క్విజ్‌ను కూడ పొందుపర్చారు. వెబ్‌సైట్ ద్వారా సంబంధిత చిత్రపటాలను కూడ చూడవచ్చును. పేర్లు, కఠిన పదాల అరబి ఉచ్చరణను కూడ వినవచ్చును. ఇప్పటి వరకు అప్‌లోడ్ చేసిన వివరాలే గాకుండా రాబోవు రోజులలో క్రొత్త క్రొత్త విషయాలను, వీడియోలను కూడ ప్రతి వారం ఇందులో అప్‌లోడ్ చేయబడును. ఈ వెబ్‌సైట్ పేరు www.313companions.org నేను ముందుగా తెల్పినట్లుగా నమాజ్ తరువాత ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తాను. అల్లాహ్ తాలా ఈ వెబ్‌సైట్‌ను కూడ ప్రజలకు ప్రయోజనకారిగా చేయుగాకా!.

---

ప్రపంచ మతముల చరిత్ర, ఆచారముల ప్రకారము మనకు చాలా స్పష్టంగా ఒక విషయము కనిపించును. అదేమనగా దేవుని తరపున అవతరించు ప్రతి సందేశహరుడు దుఆ ఆమోదము ద్వారా దైవ ఉనికికి నిదర్శనము ఇచ్చెను. వివిధ సందేశహరులు, వారి వ్యతిరేకులను ప్రస్తావిస్తు దుఆ ఆమోదపు అనేక సంఘటనలను పవిత్ర ఖుర్ఆన్ వివరించెను. హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం దుఆ, దైవ సంబంధము వల్లనే వారి కాలపు దుష్టుడు, అహంకారి ఇబ్లీస్, అతని అనుయాయులు శిక్షకు గురై, దైవ సన్నిధి నుండి బహిష్కరించబడిరి. హజ్రత్ నూహ్ అలైహిస్సలాంను వారి జాతి నిరాకరించి చాలా బాధలకు గురి చేసి, వారిని అవమానపర్చెను. అప్పుడు వారిట్లు దుఆ చేసిరి. رَبِّ لَا تَذَرْ عَلَى الْأَرْضِ مِنَ الْكٰفِرِيْنَ دَيَّارًا (నూహ్:27) అనగా "ఓ నా ప్రభువు! భూమిపై అవిశ్వాసుల ఏ గృహము కూడ మిగుల కూడదు". ఓ అల్లాహ్! ఇటువంటి కృతఘ్నులు, దురదృష్టవంతులు, గర్వితులను ప్రపంచములో మిగలకుండా చేయుము. దీని ఫలితముగా ఎటువంటి వరద వచ్చినదనగా నగరములకు నగరములు కొట్టుకుపోయినవి. నూహ్ అలైహిస్సలాం నావ ఎక్కిన వారు మాత్రమే ప్రాణాలతో మిగిలిరి. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం దుఆ ఫలితముగనే నమ్రూద్ అగ్ని పుష్పముల రూపములో మారిపోయెను.

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
| --- | --- |

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

## దేశ పాలకుల కొరకు

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ఆదర్శమూర్తులు

అనువాదము: న్యాసములను అర్హులైన వారికి అందజేయమని అల్లాహ్ ఆజ్ఞ. ప్రజలలో న్యాయము చేయవలసి వచ్చినప్పుడు న్యాయ సమ్మతముగనే నిర్ణయించుము. అల్లాహ్ నీకు బోధించినదే నిశ్చయముగా ఉత్తమమైనది. అల్లాహ్ నిశ్చయముగా సర్వశ్రవణ సమర్థుడు. సర్వసాక్షి. (అన్నిసా:59)

అనువాదము: మేము వారికి ప్రపంచములో బలము ప్రసాదించినచో వారు ప్రార్థనలు (నమాజ్) సలుపుదురు. దానములు (జకాత్) చేయుదురు. సత్కర్మలకై ఆదేశింతురు. పాపపు కార్యముల నుండి నివారించువారే (శరణార్థులైన విశ్వాసులు) వీరు. మొత్తము కార్యముల అంతము అల్లాహ్ చేతిలో నున్నది. (అల్ హజ్:42)

అనువాదము: నిశ్చయముగా దీనిలో (స్వర్గములో) నీవు గాని (నీ సహచరులు గాని) ఆకలితో నుండరని, నీవు నగ్నముగా నుండవని (నిర్ణయించబడినది). నీకు దాహముండదు. ఎండలో బాధ పడవు.

(తాహా:119,120)

గౌరవనీయులైన సభాధ్యక్షులు, మరియు గౌ॥ సభికులారా!. నేను మూడు సూక్తులను పఠించి, వాటి అనువాదమును వినిపించినాను. వీటిలో ఒక దేశము లేదా ఎటువంటి ప్రభత్వమును పాలించు పాలకులకు లేదా పౌరులకు అయినను ఇరువురికి స్పష్టమైన సందేశము, ప్రణాళిక ఇవ్వనైనది.

ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నీతి, నిజాయితితో జరగవలెనని పౌరులకు ఉపదేశించబడెను. నీతిమంతులు, జాతీయ బాధ్యతలను నెరవేర్చు ప్రతిభావంతులైన పాలకులను ఎన్నుకొనుట లేదా నియమించుటకు నిజాయితితో ప్రయత్నించవలెను. ప్రభుత్వము ఏర్పడిన తర్వాత దేశ పాలకులు సంపూర్ణ న్యాయము, నిజాయితితో కులమతాలకతీతంగా, నిస్పక్షపాతంగా పౌరుల హక్కులను చెల్లించుటకు ప్రయత్నించవలెను.

ప్రజల హక్కులలో భాగంగా ప్రాథమిక అవసరాలను తీర్చుట, కనీసం ఏ ఒక్కరు ఆకలితో అలమటించకుండా, ప్రతి ఒక్కరికి త్రాగుటకు శుభ్రమైన మంచి నీరు అందించుటకు ప్రయత్నించవలెను. శరీరమును కప్పుకొనుటకు వస్త్రములు, ప్రభుత్వ వనరులను బట్టి తలదాచుకొనుటకు గృహము అందించవలెను. ఇందు కొరకు ఇస్లాం జకాత్ (విధి దానము), పన్నుల వ్యవస్థను జారీ చేసెను.

అనంతరం ప్రజల విశ్వాసము, నమ్మకమును బట్టి ప్రార్థన చేయుటకు స్వేచ్ఛ కల్పించుట, మస్జిదులు, చర్చిలు, సీంగాగ్, మందిరముల గౌరవము, రక్షణకు తగిన ఏర్పాట్లు చేయుట ప్రభుత్వ కర్తవ్యము.

ప్రజలు తమతో పాటు ఇతరులకు కూడ సత్ప్రవర్తన, సద్గుణములు, న్యాయమును ఉపదేశించు టకు అలవాటు పడే విధంగా ఒక సమాజమును నిర్మించుటకు కృషి చేయవలెను. ప్రజలు తమతో పాటు ఇతరులను కూడ ప్రాపంచిక లేదా ధార్మిక పనులైనను సామాజిక లేదా ఆర్థిక చెడు పనుల నుండి నివారించుటకు ప్రయత్నము చేస్తుండవలెను.

ఈ సంక్షిప్త పరిచయ పదాల తర్వాత ఇప్పుడు మనము ఒక దేశ పాలకునిగా సయ్యిద్నా హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శము ఎలా వుండెనో పరిశీలించుటకు పవిత్ర మదీనా నగర పాలనను వేగంగా చుట్టేద్దాం.

ప్రవక్తృత్వ ప్రకటన అనంతరం పవిత్ర మక్కాలో అత్యంత కఠిన కష్టములు, బాధలతో కూడిన 13 సంవత్సరములు గడిపి అల్లాహ్ తఆలా ఆదేశముతో యస్రబ్ వైపు వలస వెళ్ళు సంఘటన జరిగినది. మదీనా చేరుకున్న తర్వాత సామూహికంగా

| **అహాదీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
| --- | --- |

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

నమాజులను సలుపుటకు మస్జిద్ నిర్మాణము గురించి వారికి అన్నిటికంటే ముందు ఆందోళన కలిగినది. కావున మొదట 'ఖుబా' ప్రాంతములో వారు కొన్ని రోజులు విడిది చేసినందున అక్కడ ప్రథమ మస్జిద్ నిర్మించారు. తర్వాత మదీనాకు చేరుకొని వెంటనే ఇద్దరు అనాథ బాలల భూమి కొనుగోలు చేసి మస్జిద్ నబ్వీకి శంకుస్థాపన చేశారు. చాలా సాదా అయినను ఎంతో విశాలైన మస్జిద్ నిర్మించి, ఖర్జూరపు కొమ్మలతో కప్పు వేసిరి. ఈ విధంగా దైవ ఆదేశము మేరకు సామూహిక నమాజ్ కొరకు ఏర్పాట్లు చేశారు. అనంతరం మదీనా నగర పరిపాలన వ్యవస్థను చక్కదిద్దుటకు దృష్టి సారించిరి.

మదీనా ప్రభుత్వము కూడ పుష్పములతో అలంకరించి లేకుండెనని గుర్తుంచుకోవలెను. హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడి ప్రజల అధిక ఓట్లతో గెలుపొంది మదీనా ప్రభుత్వమునకు అధినేత కాలేదు. గణించదగ్గ కొందరు విశ్వసనీయులు ఇస్లాం సందేశము, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప సద్గుణములతో ప్రభావితులై యస్రబ్ రావాలని మనవి చేస్తుండిరి. మరొక వైపు అల్లాహ్ అభీష్టము ఈ నగరమును అవతార పురుషుని నగరముగా తీర్చిదిద్దాలని సంకల్పించెను. కనుక దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సహాయ స్థితిలో రహస్యముగా తమ ఒక సహచరుడు హజ్రత్ అబూబకర్ (రజి)తో కలిసి అక్కడికి చేరుకొంటుండిరి.

కాని అల్లాహ్ తఆలా యస్రబ్‌లోని కొందరు అన్సార్‌ల హృదయములో ఎంతటి అభిమాన, విశ్వాస మనోభావాలను పుట్టించెననగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మా గృహములో నివసించాలని ప్రతి ఒక్కరు ఆశిస్తుండిరి. మరికొంత కాలము తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబీకులు, ఇతర అనుచరులు సైతం మదీనా చేరుకున్నారు. అన్నిటికంటే ముందు తమ ఇల్లు, వాకిలి వదిలిపెట్టి వస్తున్న ముహాజిర్ల (వలసదారుల) నివాస ఏర్పాట్ల సమస్య తలెత్తెను. స్వయంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడ ఒక పరదేశిగా అక్కడికి చేరుకొనిరి. ఎలాంటి ప్రభుత్వము గాని నిధి లేదా ఆర్థిక వ్యవస్థ లేకుండెను. తప్పని పరిస్థితులలో మక్కా నుండి వచ్చిన ఒక్కొక్క వలసదారునికి మదీనాలోని ఒక్కొక్క అన్సార్‌కు మధ్య సోదర బంధుత్వమును దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏర్పాటు చేసిరి. ఈ సోదర బంధుత్వము ఎంతటి గొప్ప ఆదర్శముగా నిలిచెననగా కొందరు అన్సార్ వ్యక్తులు తమ సోదరులైన వలసదారులతో ఇట్లనిరి. ఇవి నా ఆస్తి పాస్తులు. వీటిలో సగ భాగము నీది. ఉత్తమ ప్రేమానురాగాలను ప్రదర్శిస్తు చివరికి ఇట్లనిరి. నాకు ఇద్దరు భార్యలున్నారు. ఒకరికి నేను విడాకులు ఇచ్చెదను. నిర్ణీత గడువు పూర్తి అయిన తర్వాత ఆమెతో నువ్వు వివాహము చేసుకోవచ్చును. కాని ఆ వలసదారుడు కూడ ఇట్లు బదులిచ్చెను. నీ ఆస్తి పాస్తులు నీకే చెందునుగాక! నాకు కేవలం దుకాణాల వీధి చూపెట్టి కొంత నగదు రుణంగా అందించుము. అనంతరం వారు త్వరలోనే తమ కాళ్లపై నిలబడడమే కాక ఇతరులకు ఆశ్రయము ఇచ్చే స్థాయికి చేరుకున్నారు. వీరు మదీనాలోని ముస్లిములు. మక్కా నుండి వలస వచ్చిన ముస్లిం అనుచరులు ముహాజిర్లు అనబడేవారు. వీరి ఐక్యత, సోదరభావము గురించి వివేకవంతమైన చర్యలను సంక్షిప్తంగా వివరించాను.

ఈ నగరములో ఇంకా ఏ ఏ జాతులు, వర్గములు నివసిస్తుండెనో, వాటిని తమ వెంట కలుపు కొనుటకు, ఐక్యత ఏర్పాటు చేయుటకు, ఒక వ్యవస్థలో చేర్చుటకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి ప్రణాళికలు రచించారు. మదీనాలో అప్పుడు యూదులు మూడు వర్గములలో ఖైన్‌ఖా వంశీయులు, నజీర్ వంశీయులు, ఖురైజ వంశీయులు నివాసముండేవారు. అన్యారాధకుల రెండు వర్గములు ఔస్, ఖజ్రజ్ ఉండెను.

ఈ ఐదు వర్గములలో ఎలాంటి వ్యవస్థ లేకుండెను. ప్రత్యేకంగా యూదుల మూడు వర్గములు స్వతంత్రంగా, స్వపరిపాలన రూపంలో విడి విడిగా వున్న కోటలలో నివాసముండేవారు.

రెండవ వైపు మక్కా ఖురైషీలు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు మదీనాకు వలస పోయినందుకు, మదీనాలో బలపడుతున్నందుకు అవకాశము లభించినప్పుడు మదీనాపై దాడి చేసి ముస్లిములను అక్కడి నుండి తరిమి వేయుటలో సఫలము కావాలనని తహతహలాడుతుండిరి.

మదీనా లోపల, బయట ఇటువంటి పరిస్థితులు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులకు అనగా అన్సార్ అయినను, వలసదారులైనను కలత కలిగిస్తుండెను. ఎంతగా అనగా స్వయంగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు ప్రశాంతంగా నిద్రపోలేక పోయేవారు. కావున కనీసం నగరములోని ముస్లిములు, ఇతర ముస్లిమేతర తెగలు ప్రత్యేకంగా యూదుల తెగలతో శాంతియుత వాతావరణంలో నివసించుటకు ఒక లిఖిత పూర్వక ఒప్పందము తప్పనిసరిగా కుదుర్చు కోవాలని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దూరదృష్టితో ఆలోచించిరి. దాని నియమ నిబంధనలు ఇట్లుండెను.

(1) ముస్లిములు, యూదులు పరస్పరం సానుభూతి, వినయముతో వుందురు, ఒకరు మరొకరిపై దౌర్జన్యము లేదా హింసకు పాల్పడరు.

(2) ప్రతి జాతికి ధార్మిక స్వేచ్ఛ వుండును.

(3) పౌరులందరి ప్రాణము, ధనము సురక్షితముగా వుండును.

(4) అన్ని రకాల విభేదములు, వివాదముల పరిష్కారము కొరకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆశ్రయించెదరు. ప్రతి ఒక్కరి తీర్పు వారి జాతి శాసనము ప్రకారము చేయబడును.

(5) యూదులపై లేదా ముస్లిములపై ఏదేని జాతి యుద్ధమునకు దిగినచో యూదులు, ముస్లిములు పరస్పరం సహకరించుకొందురు.

(6) మదీనాపై ఎవరైనా దాడి చేసినచో అందరు కలిసి ఆ దాడిని ఎదుర్కొందురు.

(7) మక్కా ఖురైషీలకు లేదా వారి అనుయాయులకు యూదుల తరపున ఎలాంటి సహాయము లేదా ఆశ్రయము ఇవ్వకూడదు.

(8) మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి లేనిదే ఏ ఒక్కరు యుద్ధము కొరకు వెల్లరాదు.

(9) ఈ ఒప్పందము ప్రకారము ఏ క్రూరుడు లేదా అశాంతి కారకుడు శిక్ష నుండి తప్పించుకోలేడు.

పైన ప్రస్తావించబడిన యూదుల తెగలు కొన్ని ఒప్పందములను భంగపర్చినాయి, ఔస్, ఖజ్రజ్ లోని కొందరు అన్యారాధకులు ముస్లిములతోనే కలిసి వుండుట క్షేమమని భావించి బాహ్యముగా ఇస్లాం స్వీకరించారు. కాని వారి హృదయములలో విశ్వాసము తొంగి చూడలేదని తర్వాతి సంఘటనలు నిరూపించాయి. ఎందుకనగా ప్రతి ఆపద సందర్భములో వారు తమ దాంబిక మనస్తత్వమును ప్రదర్శించిరి. ఏది ఏమైనప్పటికి ఈ ఒప్పందము వలన ముస్లిములు, యూదుల మధ్య సంబంధములు దృఢమైనవి. మదీనాలో ఒక రకమైన గట్టి క్రమ శిక్షణ, వ్యవస్థ గల ప్రభుత్వము కొలువు దీరినది. దీనికి నాయకునిగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నియమితులైరి.

ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో చాకచక్యంగా మదీనా ప్రభుత్వ పరిపాలన బాధ్యతలను స్వీకరించుట, అనంతరం గొప్ప ప్రవర్తనలు, సామరస్యము, సమానతలు, సంపూర్ణ న్యాయము, నిజాయితీ ద్వారా పవిత్ర మదీనాను ఒక ఆదర్శవంతమైన ప్రభుత్వముగా తీర్చిదిద్దుట తమ దేశములోనే ప్రజల అధిక శాతం ఓట్ల ద్వారా ఎన్నికయ్యే లేదా నియమించబడిన ప్రతి నాయకునికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అద్భుత ఆదర్శముగా

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "
(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*


**సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్**

**SABIR BURQA HOUSE**
**ALL TYPES OF READYMADE BURQA**



**ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు కొరియర్ ద్వారా కూడా పంపబడును**

CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

నిలిచిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆధ్యాత్మిక స్థాయి, అంతస్తును అటుంచితే ఏ ఏ ప్రత్యేక కార్యముల వలన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సఫలమైన, అందరి మన్ననలు పొందిన ప్రభుత్వ నాయకునిగా కనిపించిరో ఆయా విషయముల ఆధారంగా ఇప్పుడు నేను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను ప్రస్తావించదలచితిని. కొందరు తిరుగాబాటుదారులు మినహా ఈ రాష్ట్రములోని ప్రజలు వారి సల్లం కొరకు తమ ప్రాణాలను త్యాగము చేయుటలో తమకు గర్వకారణముగా భావించేవారు.

అన్నిటికంటే ప్రత్యేకంగా కనిపించే మొదటి ప్రాముఖ్యత మత స్వతంత్రము, స్వేచ్ఛ. ఎందుకనగా విభిన్న మతములు, ఆచారములను విశ్వసించే ప్రజలు నివసిస్తున్న రాష్ట్రములో ప్రతి ఒక్కరికి తమ విశ్వాసము, అభిప్రాయమును వెల్లడించు, శాంతియుతంగా ప్రచారము చేయు, ఆచరించుటకు స్వతంత్రము వుండవలెను. మరొకరి మనసును గాయపర్చుటకు అనుమతి వుండకూడదు. ఇంతకు ముందు ప్రస్తావించినట్లు ఏకైక దేవుణ్ణి, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించే, పవిత్ర ఖుర్ఆన్ శాసనమును ఆచరించు ముస్లిములతో పాటు మూసా (అ) శాసనమును అచరించే యూదులు, ఈసా అలైహిస్సలాంను విశ్వసించే కొందరు క్రైస్తవులు, విగ్రహారాధకుల తెగలు మదీనాలో వుండెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుదుర్చుకున్న ఒప్పందము మేరకు నియమములను పాటిస్తు వారు సల్లం ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ కల్పించిరి. అందరికి నాయకులైనందుకు ప్రజల వివాదములు వారి సమక్షములో ప్రవేశపెట్టబడినపుడు వారి వారి మతము, శాసనము, విశ్వాసము ప్రకారము తీర్పులు వెల్లడించేవారు.

చివరికి పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు ప్రకటించెను. అల్లాహ్‌ను తప్ప వారు (ప్రార్థనలలో) పిలుచువారిని మీరు తిట్టకుడు. లేనిచో వారు శత్రువులై మూఢత్వము వలన అల్లాహ్‌ను తిట్టెదరు. (అల్ అన్ఆమ్-109)

అన్యారాధకులు ఉహద్ యుద్ధము సందర్భమున ముస్లిం అమరవీరుల శవాలను అవమానపర్చిరి. హజ్రత్ హంజ కాలేయమును నోటితో కొరికిరి. కాని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నడు వారితో ప్రతీకారము తీర్చుకొనుటకు ఆలోచించక ఎల్లప్పుడు వారితో మంచిగానే ప్రవర్తించిరి.

హజ్రత్ హసన్ బిన్ అస్వద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఒక యుద్ధము సందర్భమున హతులలో కొందరు పిల్లల శవాలు కూడ లభించెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వాకబు చేయగా ఒక వ్యక్తి ఇట్లు వేడుకొనెను. ఓ దైవ ప్రవక్త సల్లం! వీరు అన్యారాధకుల పిల్లలే కదా! బదులుగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. గుర్తుంచుకోండి! నేడు మీలో ఉత్తములైన వారు సైతం నిన్న అన్యారాధకుల పిల్లలుగానే వుండిరి. మంచిగా గుర్తు పెట్టుకోండి! ఒక పిల్లవాడు జన్మించినప్పుడు సత్యస్వభావముతోనే జన్మించును. తర్వాత అతని తల్లిదండ్రులు అతణ్ణి యూదునిగా లేక క్రైస్తవునిగా మారుస్తారు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6 పుట 24 బేరూత్)

ఒక ప్రభుత్వ అధికారిగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖ్యమైన రెండవ ప్రాముఖ్యత ఉత్తమ న్యాయమైన పద్ధతి. న్యాయము ప్రపంచ శాంతికి మూలము. నేడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న అందోళన, అశాంతికి అతిపెద్ద కారణము న్యాయము లేకపోవడమే. తమవారితోనే కాక ఇతరులతో, శత్రువులతో సైతం న్యాయము, నిజాయితిగా వ్యవహరించాలని ఇస్లాం బోధిస్తుంది. దీని గురించి మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర అనేక గొప్ప ఉదాహరణలతో అలంకరించబడి వున్నది. సమయ భావము వలన కేవలం రెండు సంఘటనలను మాత్రమే ప్రవేశ పెట్టెదను.

ఏ జాతులలో ప్రవర్తనలు దిగజారిపోతాయో వాటిలో పక్షపాతము, అన్యాయము అధికమైపోతుంది. క్రమ క్రమంగా ఈ విషయము పాతుకుపోతుంది. ధనికులు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినను శిక్ష నుండి తప్పించుకుంటారు. నిరుపేదలు, నిస్సహాయ సాధారణ ప్రజలు మాత్రమే శిక్షలు అనుభవిస్తారు. కాని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దయాసాగరులు, అనుగ్రహించువారు, కారుణ్య మూర్తులు అయినను శాసన ఆదేశములను అమలు పర్చుటలో చాలా పౌరుషము కలిగివుండిరి. న్యాయము, నిజాయితిని ఎన్నడు విస్మరించేవారు కాదు. బుఖారి షరీఫ్‌లో హజ్రత్ ఆయిషా (రజి) ద్వారా ఒక కథనము ఇట్లు ఉల్లేఖించబడెను.

"మఖ్జూమ్ తెగ వంశస్తురాలైన ఫాతిమా నామము గల ఒక మహిళ దొంగతనానికి పాల్పడెను. కావున మహా ప్రవక్త సల్లం వద్ద ఈ మహిళ విషయములో శిక్ష తగ్గింపు కొరకు సిఫారసు చేయవలెనని ప్రజలు భావించిరి. అందుకే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత ప్రియమైన ఉసామా బిన్ జైద్‌ను సిద్ధము చేసిరి. వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్ళి చాలా వినయముతో మనవి చేసిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయమును చాలా తప్పు బట్టారు. కోపముతో వారి ముఖము ఎర్రబారి పోయెను. వారిట్లనిరి. ఎవరైనా ధనికుడు దొంగతనము చేసినచో వదిలి పెట్టడం నిరుపేద చౌర్యమునకు పాల్పడినచో అతని చేతులను నరికివేయడం ఇస్రాయీల్ సంతతి వారి అలవాటుగా మారిపోయెను. కాని నా పరిస్థితి ఏమనగా ఎవరి చేతిలో నా ప్రాణమున్నదో అతని ప్రమాణముగా ఒక వేళ ముహమ్మద్ కుమార్తె ఫాతిమా కూడ దొంగతనము చేసినచో నేను ఆమె చేతులను కూడ నరికివేస్తాను. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఆలా ఆలి ముహమ్మదిన్ వాబారిక్ వసల్లిమ్.

రెండవ సంఘటన ఇట్లు గలదు. బదర్ యుద్ధములో మక్కా అన్యారాధకులైన ఖైదీలలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన హజ్రత్ అబ్బాస్ (రజి) కూడ వుండిరి. ఖైదీల పర్యవేక్షణ హజ్రత్ ఉమర్ (రజి)కు అప్పగించబడినప్పుడు వారు హజ్రత్ అబ్బాస్ (రజి)తో అందరి తాళ్ళను గట్టిగా కట్టిరి. వీరందరు మస్జిద్ నబ్వీ ఆవరణలోనే వుండిరి. తద్వారా హజ్రత్ అబ్బాస్ (రజి) తీవ్ర నొప్పితో బాధ పడుతుండిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ చిన్నాన మూలుగుతున్నట్లు విని తట్టుకోలేక పోయిరి. కావున వారికి నిద్ర పట్టలేదు. అన్సార్‌కు ఏదో విధంగా ఈ విషయము తెలిసిపోయినది. కనుక వారు హజ్రత్ అబ్బాస్ (రజి) తాళ్ళను వదులు చేసిరి. తద్వారా వారు మూలగడం మానేసిరి. హజ్రత్ అబ్బాస్ (రజి) మూలుగుతున్న శబ్దం ఎందుకు రావడం లేదు? అని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశ్నించిరి. అనుచరులు ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్త సల్లం! మీరు బాధపడుతున్న విషయమును గమనించి మేము వారి తాళ్ళను వదులు చేశాము. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇది అన్యాయమగును. ఇతర ఖైదీలందరి తాళ్ళను కూడ వదులు చేయండి లేదా అబ్బాస్ తాళ్లను కూడ గట్టిగా బిగించండి. అప్పుడు అనుచరులు మిగతా ఖైదీలందరి తాళ్లను కూడ వదులు చేశారు.

మన విధేయతార్హులు, యజమాని అయిన హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర ద్వారా మనకు కనిపించే మరో ప్రత్యేకత ఏమనగా ప్రతి క్లిష్టమైన ఘడియలో తమ జాతికి మార్గదర్శనము చేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా వుండుట ఒక సఫలమైన నాయకునికి, పాలకునికి తప్పనిసరి అని నొక్కి చెప్పిరి. సాధ్యమైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని జాతికి దిశానిర్దేశం చేస్తూ జాతికి ధైర్యము చెప్పవలెను. దీని గురించి ఒక్క సంఘటన మాత్రమే ప్రవేశపెట్టుతున్నాను.

కదంకముల యుద్ధము సందర్భమున రక్షణపరంగా, యుద్ధ ఎత్తుగడల దృష్ట్యా మదీనా చుట్టు కందకములు త్రవ్వబడుతుండెను. అనుచరులు ఆకలి బాధను

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

తట్టుకొనుటకు తమ కడుపుకు రాళ్ళు కొట్టుకొని వుండిరి. త్రవ్వుతుండగా ఒక రాయి విరగడం లేకుండెను. అనుచరులు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో మార్గదర్శనము పొందాలని ఆశించిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొనిరి. అప్పుడు వారు కూడ ఆకలి బాధను తట్టుకొనుటకు తమ కడుపుకు రెండు రాళ్ళు కట్టుకొని వుండిరి. అదే స్థితిలో వారు సుత్తె తీసుకొని ఆ రాయిపై మూడు సార్లు కొట్టి, ఆ రాయిని ముక్కలు ముక్కలు చేసిరి. అల్లాహ్ మహిమ ఇంతటి బలహీన, అచేతన స్థితిలో వారికి అల్లాహ్ తఆలా ప్రతి దెబ్బకు చుట్టు ప్రక్కల వున్నటువంటి పెద్ద పెద్ద ప్రభుత్వములను ముస్లిములు జయిస్తున్నట్లు దృశ్యములను అల్లాహ్ తఆలా చూపించెను. ప్రతి దెబ్బకు అల్లాహు అక్బర్ నినాదము చేసిరి. అనంతరం సిరియా, ఈరాన్, సన్ఆ, యెమెన్ రాజభవనముల తాళం చెవులు నాకు ఇవ్వబడెనని అనుచరులకు శుభవార్త వినిపించిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములోనే ఇస్లాం అరబ్ ద్వీపమంతా విజయము సాధించెను. వారు స్వర్గస్తులైన తర్వాత తొమ్మిద (9) సంవత్సరముల లోపే అరబ్ అంతటా ముస్లిముల రాజ్యము స్థిరపడినది.

ప్రముఖంగా కనిపించే మరో విశిష్టత ఏమనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా ప్రభుత్వాధికారిగా మారక ముందు మరియు తర్వాతి జీవితంలో ఎలాంటి వ్యత్యాసము కనిపించదు. బీద, అచేతన స్థితిలో వారు మక్కాలో ఏ విధంగా జీవితము గడిపిరో అలాగే మదీనాకు రాజుగా మారిన తర్వాత కూడ అదే సాధారణ స్థితిలో తమ జీవితము గడిపిరి. కాని ఒక వైపు ఈరానీ నాయకుల అంగరంగ వైభవము, భయభ్రాంతి మొత్తం ఆసియాలో కనిపిస్తుండెను. మరో వైపు రోమ్ ప్రభుత్వము తమ ఐశ్వర్యములు, వైభవ స్థాయిని పశ్చిమములో చూపిస్తుండెను. ఈ రెండు స్వతంత్ర ప్రభుత్వముల మధ్య నున్న అరబ్ తెగలు సైతం తమ బానిసల సేవకుల సేవలతో తమ స్థాయిని మించి తమ నాయకత్వ గొప్పతనాన్ని బహిర్గతపర్చుటకు ప్రయత్నిస్తుండిరి.

ఇటువంటి వాతావరణంలో ప్రపంచ అధినేత, శాశ్వత గర్వకారణమైన హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో సాధారణ, సామాన్య జీవితములో ఎలాంటి మార్పులు కనిపించలేదు. ఇంతేకాక మదీనా పౌరుల అభివృద్ధి, వారి పరిస్థితిని మెరుగు పరచుటకు తమపై, తమ కుటుంబ సభ్యులపై మరిన్ని కష్టములను మోపుతుండిరి. ఇంటి పనుల కోసం ఎలాంటి సేవకుడు లేకుండెను. పనులన్ని తాము స్వయముగా చేసుకునేవారు. ఇంట్లో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏమి చేసేవారని హజ్రత్ ఆయిషా (రజి)ను ప్రశ్నించగా వారిట్లు సమాధానమిచ్చిరి. '**యకూను ఫీ మిహ్నతి అహ్లిహి ఫ ఇజా హజరతిస్సలాతు ఖరజ ఇలస్సలాతి**' అనగా ఇంట్లో తమ కుటుంబ సభ్యుల పనులలో సహకరించేవారు, నమాజ్ సమయము కాగానే నమాజ్ కొరకు వెళ్ళిపోయేవారు.

(బుఖారి కితాబుస్సలాత్)

ఇదెంతటి గొప్ప ఆదర్శము. రాజు అయినను తమ ఇటి పనుల కొరకు ఒక్క జీతగాన్ని పెట్టుకొనని వ్యక్తిని ఎవరినైనా చూపగలరా! అరబ్ రాజుగా వారు లక్షలాది రూపాయలు, పశువుల మందకు మందలను అవసరమున్న ప్రజలకు పంచిపెట్టారు. ఒకసారి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద డెబ్బై (70) వేల దిర్హమ్‌లు వచ్చెను. మరొక హదీసు ప్రకారము తొంబై (90) వేల దిర్హమ్‌ల ప్రస్తావన గలదు. ఈ దిర్హమ్‌లను వారొక చాపపై పెట్టించి వాటిని పంచిపెట్టుటకు నిలబడిరి. మొత్తం పంచి పెట్టేంత వరకు అక్కడి నుండి కదలలేదు.

(అల్ వఫా బిఅహ్వాలిల్ ముస్తఫా ఇబ్నుల్ జౌజి పుట 447. బేరూత్)

ఒకసారి వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చెను. వారు అతనికి మేకలతో నిండి వున్న ఒక లోయను బహుకరించిరి. ఓ నూతన ముస్లిం లోయ మధ్యలో వున్న భూమిని కూడ అడిగెను. వారు సల్లం అతనికి ఆ భూమి కంచెలను మేకల మందతో పాటు మొత్తం కానుకగా ఇచ్చి వేసిరి. ఆ వ్యక్తి తమ జాతికి తిరిగి చేరుకున్నప్పుడు ఇట్లనెను. ఓ నా జాతి ప్రజలారా! మీరందరు ఇస్లాంలో చేరండి. ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఇంత అధికంగా పంచిపెడ్తారు. బీదరికము, ఆకలితో వారు ఎన్నడు భయపడరు.

(మజ్‌మవుజ్జవాయిద్ హైసమీ సంపుటి 9 పుట 13 బేరూత్)

కాని తమ స్వంతానికి, తమ కుటుంబ సభ్యుల కొరకు జాతీయ నిధి నుండి ఎలాంటి ప్రయోజనము పొందేవారు కాదు. ఎంతగా జాగ్రత్త పడేవారనగా ఒకసారి వారి మనుమడు (కుమార్తె కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుసేన్ (రజి) బాల్యములో ఖర్జూరముల కుప్ప నుండి ఒకటి రెండు ఖర్జూరములు తీసుకొని తమ నోట్లో వేసుకొనిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తక్షణమే నోట్లో వ్రేలు పెట్టి ఆ ఖర్జూరములను బయటికి తీసి వేసిరి. మనుమడా! ఇవి దానపు ఖర్జూరములు. మనకు ఇవి ధర్మబద్ధము కావు అని హితవు పలికిరి.

ఇంట్లో వున్న పరిస్థితి గురించి హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు ఉల్లేఖించారు. వారు తమ సోదరి కుమారుడైన ఉర్వ (రజి)తో ఇట్లు చెప్పిరి. "ఓ నా సోదరి కుమారుడా! మేము మొదటి రాత్రి చందమామ తర్వాత మరో చందమామను ఒక్కోసారి మూడు సార్లు చందమామను చూసేవారము. అనగా రెండు రెండు నెలలు గడిచినను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంట్లో పొయ్యిలో మంట పెట్టే అవసరము వచ్చేది కాదు. హజ్రత్ ఉర్వ (రజి) ఇట్లనిరి. నేనిట్లంటిని. ఓ చిన్నమ్మా! అలాంటప్పుడు మీరు ఏమి తినేది? హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు సమాధాన మిచ్చిరి. అస్వదాని అనగా రెండు వస్తువులు ఒకటి ఖర్జూరము రెండవది మంచినీళ్లతో పూట గడుపుకునేవారము. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇరుగుపొరుగున అన్సార్ వ్యక్తులు వుండేవారు. వారి వద్ద పాలిచ్చే మేకలు వుండేవి. వారు వాటి పాలను కానుకగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పంపించేవారు. వారు సల్లం ఆ పాలనే మాకు త్రాగించేవారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారాల పట్టి, స్త్రీల నాయకురాలు హజ్రత్ ఫాతిమ (రజి) పరిస్థితి ఎట్లుండెననగా ఇంట్లో ఇసుర్రాయి నడుపుతు వారి చేతులలో పొక్కులు వచ్చేవి. కొందరు బానిసలు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చినట్లు తెలిసి ఇంటి పనులలో సహకరించుటకు ఒక బానిస కావాలని ఆమె కోరిరి. రాత్రి పొద్దుపోయాక మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుమార్తె, అల్లుని వద్దకు వచ్చి వారి మధ్య పరుపులోనే కూర్చొని ఎంతో అప్యాయతతో ఇట్లు నచ్చచెప్పిరి. మీరు అడిగిన దాని కంటే ఉత్తమమైన విషయము నేను మీకు చెప్పనా! అదేమనగా మీరు తమ పరుపులలో పడుకొన్నప్పుడు 33 సార్లు సుబహానల్లాహ్, 33 సార్లు అల్‌హందులిల్లాహ్, 34 సార్లు అల్లాహు అక్బర్ అని చదవండి. ఇది మీకు ఒక సేవకుని కంటే అధిక మేలు కల్గించును.

చెప్పుకోదగ్గ ఇంకొక విషయము ఏమనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద జాతి నిధులు వుండేవి. వాటిలో నుండి తమ కొరకు లేదా తమ కుటుంబ సభ్యుల కొరకు ఖర్చు చేయుటను వారు పాపముగా భావించేవారు. ఇంతే కాక వారి స్వంత ఉపయోగమునకు సైతం చాలా నగదు వచ్చేది. అనుచరులు తమ వినయము, అనురాగము వలన అనేక కానుకలు వారికి సమర్పించుకునేవారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ స్వంత అవసరాలకు, తమ భార్యాపిల్లల కొరకు వినియోగించుకోవాలని అనుచరులు కోరుకునేవారు. తమ తర్వాత తమ కుటుంబ సభ్యులు ఎలా జీవించగలరనే ఉద్దేశ్యముతో ఒక విలువైన నగదు, ఆస్తులు సమకూర్చుకున్నచో ఎలాంటి విమర్శించదగ్గ విషయము కాకుండెను. కాని వారు తుది శ్వాస విడిచినప్పుడు వారి ఇంటి పరిస్థితి కల్లకు కట్టినట్టు అమర్ బిన్ హారిస్ (రజి) కథనముతో స్పష్టమగుతుంది. వారిట్లు తెలిపిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించే సమయమున ఇంట్లో ఏమియును వదలలేదు. దిరహమ్, దీనార్, బానిస పురుషులు, స్త్రీలు ఏమియును లేకుండెను. ఒక్క తెల్లటి కంచర గాడిద, తమ ఆయుధములు, దానము చేసిన ఒక స్థలం మాత్రమే వుండెను.

హజ్రత్ సహల్ బిన్ సాద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏడు దీనార్లు హజ్రత్ ఆయిషా (రజి) వద్ద పెట్టుకొమ్మని ఇచ్చిరి. చివరి వ్యాధిలో ఇట్లడిగిరి. ఓ ఆయిషా! నీ వద్ద వున్నటువంటి బంగారమును ఏమి చేశావు? నా వద్దనే వున్నదని వారు వేడుకొనిరి. దానము చేయమని వారనిరి. అనంతరం వారు సల్లల్లాహు అలైహి వసల్లం స్పృహ కోల్పోయిరి. కావున హజ్రత్ ఆయిషా (రజి) వారి పనిలో నిమగ్నమైరి. స్పృహలోకి రాగానే బంగారము దానము చేశావా? అని మరల అగిడిరి. ఇంకా చేయలేదని వేడుకొనిరి. వారు దీనార్లు తెప్పించుకొని తమ చేతిలో పెట్టుకొని లెక్కబెట్టిరి. ఈ ప్రపంచమును వీడుతు అల్లాహ్‌తో భేటి అగుతున్నప్పుడు ఈ దీనార్లు నా దగ్గర వున్నచో ముహమ్మద్‌కు అల్లాహ్‌పై ఎలా నమ్మకము వున్నట్లగును? అనంతరం ఆ దీనార్లను దానము చేశారు. అదే రోజు మృతి చెందారు. (మజ్‌మవుజ్జవాయిద్ హైసమీ సంపుటి 9 పుట 13 బేరూత్)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 02 JUN 2022 Issue No. 22.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.575/- (Per Issue: 11/- ) (WEIGHT: 20-50, grms / issue)

అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ వబారిక్ వసల్లిమ్.

వారి నిజమైన అభిమాని హ॥జత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్ వ మహ్దీ మాహూద్ అలైహిస్సలాం వారి జీవిత చరిత్రను వివరిస్తు ఇట్లనిరి.

"...అల్లాహ్ తఆలా అనేక నిధుల తలుపులను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు తెరిచెను. వారు సల్లం వాటన్నిటిని దైవ మార్గములో ఖర్చు చేశారు. తమ కడుపు నింపుకొనుటకు ఒక్క గింజను కూడ వాడుకోలేదు. ఎలాంటి భవనము నిర్మించలేదు, దర్బారు కట్టించలేదు. పేదల గృహముల కంటే అధిక ప్రాధాన్యత లేని మట్టితో కట్టిన ఒక చిన్న గదిలో జీవితం మొత్తం గడిపిరి. చెడు చేసినవారితో మంచి చేసి చూపారు. దుఃఖము కలిగించిన వారికి వారి ఆపద సమయంలో తమ ధనముతో సుఖ సంతోషాలు కల్పించిరి. నిద్రించుటకు అధికంగా నేలపైనే పరుపు వుండేది. నివసించుటకు చిన్న గుడిసె, భుజించుటకు జొన్నలు లేదా ఆకలితోనే సరిపెట్టుకునేవారు. ప్రాపంచిక ఆస్తి పాస్తులు తరచుగా వారికి ఇవ్వబడినవి. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ పవిత్ర హస్తములకు ప్రాపంచిక ధూళిని అంటనివ్వలేదు. వారు తాము ధనికునిగా కాక బీదవానిగా వుండుటకు ఎల్లప్పుడు ప్రాధాన్యతనిచ్చిరి. తాము అవతరించిన దినము నుండి తమ గొప్ప మిత్రుడైన అల్లాహ్ వద్దకు చేరునంత వరకు తమ దయామయుడైన దేవుణ్ణి తప్ప మరెవరికి ప్రధాన్యతనివ్వలేదు..."

(బరాహీనె అహ్మదియ్యహ్-రూహాని ఖజాయిన్ సంపుటి 1 పుట 289-290, ఫుట్‌నోట్ నం:11)

కనుక ఏదేని ఒక ప్రభుత్వ అధినేత, పాలకులకు వారి సల్లం స్వంత, కుటుంబ జీవితములోని ఈ విజ్ఞానవంతమైన విషయములు ఆదర్శముగా నిలుచును. ఇలా చేయనిదే వారు ప్రజల, పౌరుల హక్కులను సరియైన రీతిలో పర్యవేక్షించలేరు, చెల్లించలేరు.

నేడు ఇతర పాలకుల విషయము అటుంచితే ముస్లిం నాయకులు సైతం జాతీయ నిధులను స్వంత, కుటుంబ అవసరాల కొరకు ఎంత విచ్చలవిడిగా, ప్రస్తావించలేని విధంగా వాడుకుంటున్నారో మనము చదువుతున్నాము, వింటున్నాము, చూస్తున్నాము. అల్లాహ్ తఆలాయే వారికి సద్బుద్ధి ప్రసాదించు గాక! మన ప్రియతమ నాయకులు హ॥జత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శములో వెయ్యో వంతును ఆచరించు అనుగ్రహము లభించినను పౌరుల స్థితులు మెరుగు పడవచ్చును.

గౌ॥ శ్రోతలారా! ఇస్లాం ఈ శాంతియుత బోధనను, మానవత్వానికి ఉపకారి అయిన హ॥జత్ అఖ్దస్ ముహ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శమును మన ప్రియతమ ఇమామ్ హ॥జత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ నేడు ప్రపంచములోని అభివృద్ధి చెందిన పెద్ద పెద్ద దేశముల చట్టసభల్లో నిలబడి తెలుపుతున్నారు. న్యాయము, ప్రపంచ ఆందోళన, అశాంతి, తీవ్రవాదమును నివారించుటకు, వేగంగా ముంచుకొస్తున్న మూడవ ప్రపంచ యుద్ధము నుండి రక్షించుకొనుటకు ప్రపంచ స్థాయి నాయకులను హెచ్చరిస్తున్నారు.

చివరలో వాటిలోని రెండు పంక్తులను మాత్రమే ప్రవేశపెట్టి నేను నా ఉపన్యాసమును ముగించెదను. 27 జూన్ 2012వ తేదీన క్యాపిటల్ హిల్ వాషింగ్టన్ డి.సి.లో హ॥జత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా కాంగ్రెస్, సేంట్‌కు చెందిన ముఖ్య సభ్యులు, వైట్ హౌస్ సిబ్బంది, ప్రభుత్వేతర సంస్థల నాయకులు, వివిధ దేశ ప్రతినిధుల సమక్షములో ఉపన్యాసము చేసిరి. ఇందులో వారిట్లు హెచ్చరించిరి.

"మొదటి ప్రపంచ యుద్ధము ముగిసిన తర్వాత భవిష్యత్తులో మంచి, శాంతియుత అంతర్జాతీయ సత్సంబంధములు ఏర్పడాలని కొన్ని దేశముల నాయకులు ఆశించిరి. కావున ప్రపంచ శాంతి స్థాపనకు ఒక ప్రయత్నంగా లీగ్ ఆఫ్ నేషన్స్ ఏర్పాటు చేయనైనది. ప్రపంచములో శాంతిని ఏర్పాటు చేయుట, భవిష్యత్తులో యుద్ధములను నివారించుట దీని ప్రధాన ఉద్దేశముగా నిర్ణయించబడెను. దురదృష్టవశాత్తు ఈ లీగ్ సూత్రములు, దాని తీర్మాణములలో కొన్ని లోపములు, తప్పులు వుండెను. ఫలితముగా అది మొత్తం జాతుల హక్కులను సరియైన రీతిలో, సమానంగా రక్షించలేక పోయెను. ఈ అసమానతల వలన శాశ్వత శాంతి ఏర్పడలేదు. లీగ్ ప్రయత్నములు విఫలమైనవి. దాని ప్రత్యక్ష ఫలితముగా రెండవ ప్రపంచ యుద్ధము సంభవించినది. దాని తర్వాత జరిగిన సాటిలేని వినాశనము, విధ్వంసము మనందరికి తెలుసు. ఇందులో భాగంగా సుమారు 7 కోట్ల 50 లక్షల ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయిరి. వీరిలో అధిక సంఖ్య అమాయక పౌరులదే వుండెను. ప్రపంచమునకు గుణపాఠముగా ఈ యుద్ధము సరిపోవలసి వుండెను. దీని ఫలితముగా న్యాయబద్ధంగా ఇరు పక్షములోని అందరికి సమంజసమైన హక్కులు లభించుటకు ప్రణాళికలు రచించవలసి వుండెను. తద్వారా ఈ సంస్థ ప్రపంచ శాంతికి ఒక కారణముగా రుజువయ్యేది. నిస్సందేహంగా అప్పటి ప్రభుత్వములు కొంత మేర శాంతి స్థాపనకు కృషి చేసినవి. తద్వారా ఐక్య రాజ్య సమితి ఏర్పాటైనది. కాని ఐక్య రాజ్య సమితి ప్రధాన, ముఖ్యమైన గొప్ప ఉద్దేశము కూడ పూర్తి కాలేదని త్వరలోనే తేలిపోయినది."

(ప్రపంచ సంక్షోభము-శాంతి మార్గము: పుట 74-75)

ఇలాగే 11 జూన్ 2013వ తేదీన పార్లమెంట్ హౌస్ లండన్‌లో చేసిన ఉపన్యాసములో వారిట్లు ప్రసంగిచిరి.

"ప్రపంచ శాంతి, పరస్పరం సామరస్యము ఏర్పాటు అగుటకు చేయు కృషిలో భాగంగా అందరు ఇతరుల మతములన్నిటిని గౌరవించుట ఈ సమయపు ముఖ్యమైన అవసరము. లేనిచో భయంకరమైన ఫలితములు వెలువడును. ప్రపంచము ఒక భూగోళ గ్రామముగా మారిపోయినది. కావున పరస్పరం అమర్యాద వలన, శాంతిని ప్రోత్సహించుటకు పరస్పర ఐక్యత ఏర్పాటు కానిచో స్థానిక జనాభా లేదా నగరములకు లేదా ఏదేని ఒక్క దేశమునకు నష్టము వాటిల్లక మొత్తం ప్రపంచ వినాశనానికే ఇది దారి తీయును. గత రెండు ప్రపంచ యుద్ధముల భయంకర వినాశనము మనకందరికి మంచిగా తెలుసు. కొన్ని దేశముల విధానాల వలన మరొక ప్రపంచ యుద్ధము ముంచుకొస్తున్నది. ప్రపంచ యుద్ధము జరిగినచో సుదీర్ఘ కాలము వరకు కొనసాగే వినాశనకర ఫలితములతో పశ్చిమ దేశాలు కూడ ప్రభావితమగును. కావున తమను తాము ఈ వినాశనము నుండి రక్షించుకొనుటకు ముందుకు రండి. రాబోవు మన తరాలను యుద్ధపు విధ్వంసకర, వినాశనకర ఫలితముల నుండి రక్షించుకోందాం రండి. ఎందుకనగా ఈ యుద్ధము అణు యుద్ధమగును. ప్రపంచము వెల్తున్న దిశను చూసినచో నిశ్చయముగా ఇటువంటి మరొక యుద్ధము సంభవించే ప్రమాదము పొంచి వున్నది. ఈ భయానక ఫలితముల నుండి రక్షించుకొనుటకు న్యాయము, నీతి, నిజాయితిని అవలంభించవలెను. ప్రపంచ శాంతిని భంగపరచటుకు ప్రయత్నిస్తున్న పక్షములకు విరుద్ధంగా ఏకమై నివారించవలెను.

నా కోరిక మరియు హృదయపూర్వక ప్రార్థన ఏమనగా ఈ విషయములో పెద్ద శక్తులకు తమ బాధ్యతలు, విధులను అత్యంత న్యాయబద్ధంగా, మంచి పద్ధతిలో నిర్వర్తించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! ఆమీన్"

(ప్రపంచ సంక్షోభము-శాంతి మార్గము: పుట 129)

వ ఆఖిరు దావానా అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz